
వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మించే ప్రదేశం ఇదే

వరికపూడిశెల ముందడుగు.!

- ఆటవీశాఖకు రూ.14.5 కోట్లు చెల్లించిన ప్రభుత్వం
- పనులు చేపట్టేందుకు మార్గం సుగమం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి):
పల్నాడు ప్రజల దశాబ్దాల వరికపూడిశెల కల నెరవేరనుంది. ప్రాజెక్టు నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. ప్రాజెక్ట్ నిర్మాణంలో ఉన్న అటవీ శాఖ భూములకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించింది. రూ.14.5 కోట్లు ఆటవీశాఖకు చెల్లిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ నెలలో జరిగిన మంత్రి మండలి సమావేశంలో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.340.26 నిధులు మంజూరు చేస్తూ తీర్మానం చేసిన విషయం తెలిసిందే. ప్రాజెక్టు నిర్మాణంలో తలెత్తిన అడ్డంకులు ఒక్కొక్కటిగా తొలగిపోతున్నాయి. నిర్మాణానికి సంబంధించి కేంద్రం నుంచి (మిగతా 6వ పేజీలో)

కుడికాల్వకు నీటి విడుదల

- 5 వేల క్యూసెక్కులకు పెంచిన అధికారులు
- సాగు, తాగు నీటి అవసరాలకు 132 టీఎంసీలు
- మరో 24 టీఎంసీలకు పెంచాలని ప్రతిపాదనలు
- నేడు సాగర్ గేట్లు తెరవనున్న తెలంగాణ మంత్రులు


- సాగర్ డ్యాం నుంచి కుడికాలువకు నీటి సరఫరా
- 585 అడుగుల నీటి మట్టం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
నాగార్జున సాగర్ జలాశయం నిండుకుండలా దర్శనమిస్తోంది. దీంతో జవహర్ కుడి కాల్వకు డ్యాం నుంచి నీటి విడుదలను 500 నుంచి 5 వేల కూసెక్కులకు పెంచినట్టు జల వనరుల శాఖ ఎస్ఈ కృష్ణమోహన్ తెలిపారు. సాగు, తాగు అవసరాలకు 132 టీఎంసీలు నీటిని కేటాయించారు. అయితే మరో 24 టీఎంసీలు కేటాయించాలని కోరుతూ జలవనరుల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. జూలైలోనే పుష్కలంగా సాగునీరు సరఫరా చేయడం 18 ఏళ్లలో ఇదే తొలిసారి. వర్షాలు సమృద్ధిగా కురవడంతో పత్తి, కంది, మొక్కజొన్న పంటలను రైతులు విస్తృతంగా సాగు చేస్తున్నారు. మరో వైపు నీరు విడుదల కావడంతో వరి సాగు పనులు ముమ్మరమయ్యాయి.

నేడు తెరచుకోనున్న సాగర్ గేట్లు

సాగర్ జలాశయంలో నీటి నిల్వ గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో డ్యాం క్రస్ట్ గేట్లను మంగళవారం తెరచి పులిచింతలకు నీటిని తెలంగాణ మంత్రులు (మిగతా 6వ పేజీలో)

పుడమ్మీ!


సారం కోల్పోతున్న పొలాలు

- మట్టి పరీక్షల్లో తేలిన భూమి అనారోగ్యం
- పంట భూముల్లో అరకొరగా సూక్ష్మ పోషకాలు
- ప్రధానం.. జింకు, సల్ఫేట్, ఐరన్ లోపం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
పంట భూముల్లో సారం తగ్గుతోంది. నానాటికి పుడమిలో సూక్ష్మ పోషకాలు తరిగిపోతున్నాయి. మట్టి ఆరోగ్య పరీక్షల ద్వారా సూక్ష్మ పోషకాల లోపాలను వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. జిల్లాలో 23,194 మట్టి నమూనాలను సేక రించారు. వీటిలో 12,412 నమూనాలను పరీక్షించి భూమిలో సూక్ష్మపోషకాలు ఏ మేరకు ఉన్నాయో తేల్చారు. చాలా మండలాల్లో సూక్ష్మ పోషకాలు గణనీ యంగా తగ్గినట్లు నిర్ధారించారు. పలు ప్రాంతాల్లో ఏ మేరకు సూక్ష్మపోషకాలు భూమిలో ఉన్నాయో రైతులకు అధికారులు తెలియజేస్తున్నారు. పరీక్షలు పూర్తయిన రైతులకు పుడమి ఆరోగ్య కార్డుల పంపిణీకి వ్యవసాయ శాఖ సిద్ధమైంది. సూక్ష్మపోషకాల లోపాల నివేదికను ప్రభుత్వానికి అందజేయనుంది. సాగులో విచ్చల విడిగా రసాయనాలు వాడటం వల్ల కూడా భూసారం తగ్గిపోతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల రాయితీపై రైతులకు సూక్ష్మ పోషకాలు పంపిణీ చేయలేదు. సూక్ష్మ పోషకాల పంపిణీని పునరుద్ధరించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

80 శాతం జింక్, సల్ఫర్ లోపాలు..

అమరావతి మండలంలోని భూము ల్లో 80 నుంచి 94 శాతం వరకు సల్ఫర్, జింక్, ఐరన్ లోపాలను పరీక్షల ద్వారా వ్యవసాయ అధికారులు నిర్ధారించారు. బెల్లంకొండ, దాచేపల్లి, మాచవరం, రాజుపాలెం, రెంటచింతల, సత్తెనపల్లి, శావల్యాపురం మండలాల్లో ప్రధానంగా జింక్ లోపాన్ని గుర్తించారు. అమరా వతి, బెల్లంకొండ, బొల్లాపల్లి, గురజాల, నకరికల్లు, రాజుపాలెం, సత్తెనపల్లి, వెల్దుర్తి మండలాల్లో స్థూల పోషకాలైన సేంద్రీయ కార్బన్, పాస్ప రస్, నైట్రోజన్ లోపాలు మట్టి పరీక్షల్లో తేలాయి. అయా మండలాల్లో భూమిలో సంబంధిత పోషకాలను పెంచుకొవాల్సిన అవశ్యకతను (మిగతా 6వ పేజీలో)



సూక్ష్మ పోషకాల లోపాలను తెలిపే చిత్రం



హలో.. మాస్టారు!

పర్సంటేజీలు ఇవ్వాల్సిందే..

ఉపాధ్యాయులు ఇంట్లో శుభకార్యాలు, గృహ నిర్మాణం, పిల్లల చదువులు, అనారోగ్య సమస్యలు తదితర కారణాలతో పీఎఫ్ రుణాల కోసం దరఖాస్తు చేస్తారు. దరఖాస్తు చేసిన మొత్తాలకు అనుగుణంగా పర్సంటేజ్ ఇవ్వాల్సి వస్తోందని ఆరోపణలు వెలువెత్తుతున్నా యి. రూ.5 లక్షల రుణానికి జడ్పీలో పీఎఫ్ విభాగాల్లో దాదాపు రూ.10 వేలకు పైగా చెల్లించుకోవాల్సి వస్తోందని ఆరోపణ లున్నాయి.





మీ ఫైల్ పూర్తయింది ఒక్కసారి కలవండి..!

పీఎఫ్ రుణం, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కూ పర్సంటేజీ..

- జడ్పీలో పీఎఫ్, ఆడిట్ సిబ్బంది వేధింపులు
- గగ్గోలు పెడుతున్న ఉపాధ్యాయులు

జడ్పీలో ఫైల్స్ కదలాలంటే పర్సంటేజీ ముట్టాల్సిందే. ఇది ఉపాధ్యాయులకూ తప్పడం లేదు. ఉపాధ్యాయులు పీఎఫ్ రుణం, విశ్రాంత ఉపాధ్యాయులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం దరఖాస్తు చేసుకుంటే.. ఫైల్ పూర్తయింది.. తమని కలవాలంటూ పరిషత్‌లోని పీఎఫ్, ఆడిట్ విభాగాల నుంచి వారికి ఫోన్లు వస్తున్నాయి. వారితో పర్సంటేజీలు మాట్లాడుకున్న తర్వాతే..ఫైల్స్ ముందుకు కదులుతున్నాయి. లేకుంటే.. ఏదో ఒక కొర్రీ పెట్టి పెండింగ్ పెడుతున్నారు.

గుంటూరు (విద్య) జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పీఎఫ్, ఆడిట్ విభాగాల నుంచి వచ్చే ఫోన్లతో ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు బెంబేలెత్తిపోతున్నారు. తాము దాచుకున్న డబ్బు.. రుణం రూపంలో పొందడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దయనీయమైన స్థితి నెలకొందని ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం కాళ్లు అరిగేలా జడ్పీ కార్యాలయంలోని విభాగాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇటీవల దాదాపు 55 మంది ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రీ ఆడిట్ ఫైల్‌ను వివిధ కారణాలతో తిరస్కరించడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు లేని నిబంధనలు పెట్టి ఉపాధ్యాయులను ఇక్కట్ల పాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆరోగ్య సమస్యలున్నా.. వదలడం లేదు

ఉపాధ్యాయులు వివిధ అనారోగ్య సమస్యలతో రుణం కోసం దరఖాస్తు (మిగతా 6వ పేజీలో)

సంతానోత్పత్తి కేంద్రాలను.. తనిఖీ చేయండి


6

- లోపాలుంటే సమగ్ర నివేదిక అందజేయండి
- వైద్య ఆరోగ్య శాఖకు ప్రభుత్వ ఆదేశాలు

ఉచిత ప్రయాణంపై కసరత్తు



6

- ప్రణాళికలు సిద్ధం చేస్తోన్న ఆర్టీసీ యంత్రాంగం
- రేపు గుంటూరులో ఆర్టీసీ ఎండీ తిరుమలరావు సమావేశం

రియల్ మోసం

- అంపాపురంలో వీవీఆర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ దారుణం
- కొనుగోలుదారుల నెత్తిన శఠగోపం పెట్టి పరార్
- మోసపోయిన వారిలో కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందినవారు

6

నరసరావుపేటలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని నిర్మించండి: ఎంపీ శ్రీకృష్ణ

ఉత్తీర్ణతలో ఉత్తమంగా నిలపాలి

- కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- 'పల్నాడు విద్యార్థి లక్ష్య సాధన' స్టడీమెటీరియల్ ఆవిష్కరణ

నరసరావుపేట టౌన్/ రూరల్ జూలై 28 (ఆంధ్రజ్యోతి): 'పల్నాడు విద్యార్థి లక్ష్య సాధన' స్టడీ మెటీరియల్‌ను సోమవారం తన కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆవిష్కరించారు. ప్రధాన ప్రశ్నలు, సమాధానాలతో కూడిన ఈ మెటీరియల్‌ను ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటి నుంచే అన్ని పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్‌లో పంపిణీ చేసి, పదో తరగతి పరీక్షల ఉత్తీర్ణతలో జిల్లాను ఉన్నత స్థానంలో ఉంచాలని సూచించారు. జేసీ సూరజ్ ధనుంజయ్ , డీఆర్వో మురళి, డీఈవో చంద్రకళ, అధికారులు పాల్గొన్నారు.


శంకర భారతిపురం హైస్కూల్లో ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

పాఠశాల తనిఖీ..

నరసరావుపేట మండలం లింగంగుంట్ల పంచాయతీ పరిధిలోని శంకర్ భారతిపురం హైస్కూలను కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆకస్మిక తనిఖీ చేశారు. సబ్జెక్టుల వారిగా తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. ఆరో తరగతి విద్యార్థుల భాషా సామర్థ్యాలను కలెక్టర్ పరీక్షించారు. విద్యార్థులతో పాఠాలు అప్పజెప్పించుకుని, బోర్డుపై వాటిని రాయించారు. చదవడం, రాయడంలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను, డీఈఓ చంద్రకళను కలెక్టర్ ఆదేశించారు. కొద్ది రోజుల్లో మళ్లీ వస్తానని, విద్యార్థుల సామర్థ్యాలు మెరుగు పడాలని స్పష్టం చేశారు. పేట ఉప విద్యాశాఖ అధికారి సుభాని, ఎంఈఓ ఎస్. నాగేశ్వరావు, హెచ్.ఎం పి.పార్వతి పాల్గొన్నారు.

వసతి గృహాలను తనిఖీ చేయండి

నరసరావు పేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ వసతి గృహాలను మండల స్పెషల్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశించారు. పీ-4 గ్రామ సభలను పర్యవేక్షించాలని వారికి సూచించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో వివిధ అంశాలపై అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సాగర్ నీటి జలాల విడుదల విషయాన్ని తహసీల్దార్లు స్థానికంగా ప్రచారం కల్పించాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి అక్రమాలకు తావు లేకుండా చూడాలన్నారు.

లక్ష్యం నీరుగారిపోయింది!


పెదకూరపాడులో నిరుపయోగంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్

పెదకూరపాడులో నిరుపయోగంగా శుద్ధజల కేంద్రం

పెదకూరపాడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాలకు శుద్ధి నీటిని అందించాలనే లక్ష్యం నీరుగారుతోంది. ప్రజలు రోగాల బారిన పడకుండా కాపాడే శుద్ధ జల కేంద్రం నిరుపయోగంగా మారింది. పెదకూరపాడులోని అంబేడ్కర్ రీడింగ్ రూం వద్ద అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో పెదకూరపాడు ఎమ్మెల్యేగా కొమ్మలపాటి శ్రీధర్ ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. టీడీపీ పాలనలో స్థానిక ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని అందించారు. సుమారు 600 కుటుంబాల ప్రజలకు 20 లీటర్ల తాగు నీటిని ఐదు రూపాయలకే సరఫరా చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక.. శుద్ధ జల కేంద్రం రెండేళ్లలోనే నిరుపయోగంగా మారింది. కేంద్రం నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేయడంతో.. లక్షలాది రూపాయలు విలువచేసే పరికరాలు తుప్పు పట్టి.. పనికి రాకుండా పోయే ప్రమాదం నెలకొంది. ప్రస్తుతం ప్రజలు 20 లీటర్ల క్యాన్ వాటర్‌ను రూ.15 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి.. శుద్ధ జల కేంద్రానికి మరమ్మతులు చేయించి, తాగు నీటిని అందించాలని స్థానికులు కోరుతున్నారు.


శుద్ధ జల కేంద్రం మిషనరి


నిరుపయోగంగా ఫిల్టర్లు ట్యాంక్

జగ్గాపురంలో వైసీపీకి షాక్

జనసేనలో చేరిన 54 మంది కార్యకర్తలు


పార్టీలో చేరినవారితో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, రాజారమేష్

యడ్లపాడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని జగ్గాపురం గ్రామానికి చెందిన 54 మంది వైసీపీ కార్యకర్తలు నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ నాయకత్వం పట్ల ఆకర్షితులై, జనసేన నాయకుల సేవాభావాన్ని చూసి పార్టీలో చేరుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ పరిపాలన పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారికి సంపూర్ణ మద్దతు, సముచిత గౌరవం ఉంటుందని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో.. తులసి రత్తయ్య, చౌడవరపు రామారావు, తులసి సుబ్బారావు, తెనాలి సాంబశివరావు, జగన్‌మోహనరావు, సుబ్బారావు, తెనాలి రాఘవరావు, బత్తినేని వెంకటేశ్వర్లు, వెంగలశెట్టి అప్పారావు, భవిరిశెట్టి శ్రీహరినాథ్, పానకాల సుబ్బారావు, తులసి గోవర్ధనరావు, జెట్టి పవన్, బత్తినేని గోపి, తులసి లక్ష్మీనారాయణ, భవిరిశెట్టి సత్యన్నారాయణతోపాటు మరో 40మంది ఉన్నారు. జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి షేక్ సుభాని, పట్టణ అధ్యక్షుడు మునీర్‌హసన్ తదితరులున్నారు.



ఘనంగా లావు రత్తయ్య పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు(విద్య), జూలై 28 (ఆంధ్రజ్యోతి): వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య జన్మదిన వేడుకలను సోమవారం నిర్వహించారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల్లో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలను నిర్వహించారు. డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు మాత్రమే తారతమ్య భేదాలు లేకుండా శుభాకాంక్షలు తెలియజేస్తారని అన్నారు. విద్యార్థులందరూ జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తే తాను ఇంకా ఎక్కువ సంతోషిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో హైద రాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ డాక్టర్ పావులూరి సుబ్బారావు, ఎన్విడా సీనియర్ ఏఎస్ఐసీ మేనేజర్ మౌనిక, వర్సిటీ వైస్ చాన్సలర్, కల్నల్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ ఎల్ రాణి రుద్రమదేవి, సీఈవో మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్, లారా ప్రిన్సిపాల్ కే ఫణీంద్రకుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ పీ శ్రీనివాసబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జే మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఆచార్య నాగభూషణం, సుబ్బారావు తదితరులు

గుంటూరు(విద్య), జూలై 28 (ఆంధ్రజ్యోతి): వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీ ఆర్థిక సౌజన్యంతో స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పావులూరి సుబ్బారావు, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్యలు రిబ్బన్ కట్ చేసి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్స్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పావులూరి సుబ్బారావుతో వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

ఉద్యోగావకాశాలు

➟ HDFC Life wants advisors for insurance / unit linked deposit schemes. Decent commission + incentives + gifts + foreign trips. Contact : 9985666606
AJG-239536

➟ సాయి హాస్పిటల్ నందు పనిచేయుటకు నర్సింగ్ స్టాఫ్ మరియు హౌస్ కీపింగ్ స్టాఫ్ కావలెను. తెనాలి, విజయవాడలలో సంప్ర॥ 9494351453.
SAAA-934

➟ రిటైర్డ్, గృహిణులు, మార్కెటింగ్ ఆడిటర్స్, టీచర్స్ RMP డాక్టర్స్‌కు శుభవార్త. గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు 10th పాస్ & వ: 35 + సం.లు వారు కావలెను. సెల్ :98853 08538
AJB-188

PLOT FOR SALE

➟ బందరు రోడ్డు, కంకిపాడు టోల్ గేట్ రాబోయే ORR ముందు హైవేకి 2Km దావులూరు ఊరికి ఆనుకొని 5 ఎ. పంచాయతీ లేఅవుట్ అన్ని వసతులతో స్పాట్ రిజిస్ట్రేషన్ స్పాట్ కన్‌స్ట్రక్షన్స్ గ.8900/- Hyma Prasad ✆ 99596 45468
AJB-194

FLAT FOR SALE

➟ SAI PAVANI HEIGHTS, PALAKALURU ROAD, 3BHK FIRST FLOOR 102, EAST FACING, 1705 sft, Fully furnished, Phone 8008261994 Sale price sft Rs 5,000
AJG-239556

మీ సర్టిఫికేట్స్ పోయినవా?

➟ మీరు పోగొట్టుకున్నా / కాలిన / చిరిగిన 10, ఇంటర్, డిగ్రీ మొ॥ సర్టిఫికెట్స్ తెప్పించబడును. సర్టిఫికెట్స్ కరెక్షన్ & పేరు మార్పిడికి గైడెన్స్, స్టూడెంట్స్ సర్వీస్ సెంటర్, గుంటూరు. సెల్ : 98491 85616.
AJG-239627

గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును

➟ బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర :88024 89999
AJB-209461

సర్వీసెస్

నవయుగ ట్రస్ట్

➟ నవయుగ ట్రస్ట్ వారిచే కృత్రిమ అవయవములు అమర్చబడును మోకాలి క్రింద వరకు 7,000/- మోకాలిపైన 25,000/- ఖరీదు 1-8-2025 నుండి 31-8-2025 వరకు అమర్చబడును. డాక్టర్ జి. వెంకట్రావు, 2వ లైను, సుబ్బారావు కాలనీ, విజయవాడ-8, సెల్ :76800 24648
AJB-209459

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు
ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం :
ఉ॥ 10:00 గం॥ల నుండి
సా॥ 06:00 గం॥ల వరకు
(సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

గుంటూరు 1 టౌన్	97036 18725
గుంటూరు 2 టౌన్	99854 01056
తెనాలి	99854 11202
నరసరావుపేట	99854 11206
బాపట్ల	99663 35084
పిడుగురాళ్ళ	93909 05725
మంగళగిరి	93986 73618
అమరావతి	95027 86195
పొన్నూరు	97042 99094
రేపల్లె	99854 12254
చిలకలూరిపేట	91103 23914
వినుకొండ	99662 50266
మాచర్ల	88861 19952
సత్తెనపల్లి	97048 67908
ప్రత్తిపాడు	63004 34285

సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

రియల్ మోసం

- అంపాపురంలో వీవీఆర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ దారుణం
- కొనుగోలుదారుల నెత్తిన శఠగోపం పెట్టి పరార్
- ప్లాట్లు కొన్నవారి స్థలాల్లో మరో రిజిస్ట్రేషన్
- మోసపోయిన వారిలో కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందినవారు
- విశ్రాంత అధికారులతో పాటు ఆర్మీలో పనిచేసిన వారికీ టోకరా
- బాపులపాడు తహసీల్దార్‌ను ఆశ్రయించిన బాధితులు

(ఆంధ్రజ్యోతి, హనుమాన్‌జంక్షన్)

గన్నవరంలో మరో 'రియల్' మోసం వెలుగుచూసింది. గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం అంపాపురంలో భారీ వెంచర్ వేసి ప్లాట్లు విక్రయించిన వీవీఆర్ హౌసింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ కొనుగోలుదారుల నెత్తిన శఠగోపం పెట్టింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన బాధితులు పెద్దసంఖ్యలో ప్లాట్లు కొని మోసపోయారు. ప్లాట్లు విక్రయించిన వీవీఆర్ యాజమాన్యం అదృశ్యమైంది. కొనుగోలు చేసిన ప్లాట్లు వ్యవసాయ పొలాలుగా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి. ఏకంగా వారి పేరుతో రిజిస్ట్రేషన్లు కూడా జరిగిపోయాయి. తమ ప్లాట్ల దగ్గరకు వెళ్తున్న కొనుగోలుదారులను చూసి.. స్థానికుల ఆ స్థలాలు మావి అంటూ అడ్డుకుంటున్నారు. దీంతో మొత్తం 80 మంది బాధితులు సోమవారం బస్సులో బాపులపాడు తహసీల్దార్ మురళీకృష్ణను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మోసంలో కృష్ణాజిల్లాతో పాటు గుంటూరు, తెనాలికి చెందిన వందల మంది మధ్యతరగతి వారు బాధితులుగా ఉన్నారు. వీరిలో విశ్రాంత అధికారులతో పాటు ఆర్మీకి చెందినవారు కూడా ఉన్నారు.

జరిగింది ఇలా..

అంపాపురం గ్రామంలోని సర్వే నెంబర్ 201-1, 203-1, 210-2, 213-2లో సుమారు 44 ఎకరాల్లో 33 ఎకరాలను వ్యవసాయేతర భూమిగా మార్చినట్టు ప్రచారం చేసి 2010లో వీవీఆర్ హౌసింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వెంచర్ వేసింది. కృష్ణా, గుంటూరు, తెనాలి జిల్లాలకు చెందిన సుమారు 443 మందికి ప్లాట్లను విక్రయించింది. నాటి పంచాయితీ అధికారి సంతకంతో కూడిన లేఅవుట్ ప్లాన్, పంచాయితీకి కట్టిన రశీదుల ఆధారంగా ఆ సంస్థ రిజిస్ట్రేషన్లు చేసింది. కాగా, 2020, ఆ తర్వాత కొందరు వ్యక్తులు వెంచర్ వేసిన ఈ భూమిలోని 13 ఎకరాలను వ్యవసాయ భూమిగా చూపించి రిజిస్ట్రేషన్లు చేయించుకోవడంతో పాటు పట్టాదారు పాసు పుస్తకాలు కూడా పొందడం గమనార్హం. అయితే, వెంచర్‌లో ప్లాట్లు కొన్న వారిలో కొందరు కంచె వేసుకునే ప్రయత్నాలు చేయగా, స్థానికంగా కొందరు అడ్డుకున్నారు. అప్పటికే వీవీఆర్ నిర్వాహకులు పత్తా లేకుండాపోవడంతో మోసపోయామని గ్రహించిన కొనుగోలుదారులు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా రెవెన్యూ యంత్రాంగానికి ఫిర్యాదు చేశారు. అధికారుల నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో కొనుగోలుదారుల్లో 80 మందికిపైగా బాధితులు కమిటీగా ఏర్పడి సోమవారం బస్సులో వెళ్లి తహసీల్దార్ మురళీకృష్ణను కలిశారు. తమ దగ్గరున్న సర్వే నెంబర్లు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో కూడిన ఆధారాలను చూపించి న్యాయం చేయాలని కోరారు. వ్యవసాయేతర భూమికి రెవెన్యూ వారు పట్టాదారు పాసు పుస్తకాలు ఎలా ఇచ్చారని, భీమవరపు సాంబిరెడ్డి అనే వ్యక్తికి వ్యయసాయ భూమిగా ఎలా అమ్మారని, దానికి రిజిస్ట్రేషన్ల శాఖ ఎలా అంగీకరించిందని ప్రశ్నించారు. వ్యవసాయేతర భూమికి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వడం రెవెన్యూ తప్పిదంగా భావించి ఆ పాసు పుస్తకాలను రద్దు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపానని, ప్లాట్లను అప్పగించడం వంటి విషయాలు రెవెన్యూ పరిధిలోకి రావని మురళీకృష్ణ వారికి చెప్పారు. గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లు వేయడం, అమ్మడం చేస్తూ మోసం చేస్తున్నారని కొనుగోలు చేసే ముందు అన్ని విషయాలు పరిశీలించాలని హితవు పలికారు.



అంపాపురంలో తమ ప్లాట్ల వద్ద బాధితుల ఆందోళన

నాడు అధోగతి.. నేడు పురోగతి

● బుగ్గవాగు రిజర్వాయర్‌కు 3, 6 క్రస్ట్ గేట్లు ఏర్పాటు ● ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కాంతారావు

రెంటచింతల,జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నాలుగు జిల్లాల రైతుల జీవనాడి బుగ్గవాగు రిజర్వాయర్‌ను ఐదేళ్లుగా పట్టి పీడిస్తున్న మరమ్మతుల సమస్య ఒక కొలిక్కి వచ్చింది. సాగు నీటి కోసం అన్నదాతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు నేడు తొలగిపోయాయి. తుప్పు పట్టి పట్టుకుంటే ఊడిపోయే విధంగా ఉన్న 3,6 క్రస్ట్ గేట్ల స్థానంలో నూతన గేట్లను అమర్చే ప్రక్రియను కూటమి ప్రభుత్వం చేపట్టి సోమవారం నాటికి పూర్తి చేసింది. గురజాల, మాచర్ల ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యను జలవనరుల మంత్రి డి.రామానాయుడు దృష్టికి తీసుకెళ్లారు. రూ.60 లక్షల నిధులు విడుదల చేయించడంలో సఫలీకృతులయ్యారు. పనులు పూర్తవ్వడంతో రిజర్వాయర్‌కు ఎగువన ఉన్న సాగర్ నుంచి 2 వేలు క్యూసెక్కుల దాకా నీటిని విడుదల చేస్తున్నారు.

వృథా నీటిని అరికట్టాం

నూతన గేట్లను ఏర్పాటు చేయడం వల్ల వృథా నీటిని అరికట్టామని ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు తెలిపారు. రిజర్వాయర్ వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. మరో రెండు గేట్లను మార్చాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వీటికి కూడా ప్రతి పాదనలు పంపామన్నారు. సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, 10 హెచ్‌పీ సామర్థ్యం గల ఆరు మోటార్లు మరమ్మతులకు గురయ్యాయని, విద్యుత్ తీగలు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. కొన్ని స్తంభాలు చోరీకి గురైనట్లు వెల్లడించారు. ప్రతి సారి జనరేటర్ మీద గేట్లను ఎత్తడం కష్టసాధ్యంగా మారిన నేపథ్యంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. సాగర్ కెనాల్ మీద 901 మంది లస్కర్లు ఉండాల్సి ఉండగా కేవలం 72 మంది మాత్రమే ఉండడం సమస్యకు మరో కారణంగా పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం 5 టీఎంసీలకు పెంచడానికి ఇద్దరు ఎమ్మెల్యేలు తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. డీసీ చైర్మన్లు పాల్గొన్నారు.



బుగ్గవాగు రిజర్వాయర్‌కు ఏర్పాటు చేసిన గేట్లు

కిట్స్ కళాశాలకు ఎన్‌బీఏ టైర్ - 1 గుర్తింపు

చైర్మన్ కోయ సుబ్బారావు



వట్టిచెరుకూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంపరిధి వింజనంపాడు గ్రామ సమీపంలోని కిట్స్ కళాశాలకు టైర్ - 1లో నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ గుర్తింపు లభించినట్టు కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు వెల్లడించారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్ర త్యేక సమావేశంలో కోయ సుబ్బా రావు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి బ్రాంచ్‌లకు (సీఎస్ఈ, ఐటీ, ఈసీఈ, ఈఈఈ) గుర్తింపు లభిం చిందన్నారు. కళాశాల స్థాపించిన నాటి నుంచి మూడోసారి ఇలాంటి ప్రతిష్ఠాత్మకమైన ఎన్‌బీఏ గుర్తింపు కళాశాలకు లభించిందని, కళా శాల పాటిస్తున్న ప్రమాణాలకు ఈ గుర్తింపు నిదర్శనమన్నారు. దీనిని సాధించేందుకు కృషి చేసిన అధ్యాపకులు, సిబ్బందికి చైర్మన్ సుబ్బారావు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కళాశాల కార్యదర్శి కోయ శేఖర్ మాట్లాడుతూ జాతీయ సంస్థలతో తమ కళాశాల పొం దిన ఈ గుర్తింపు తాము అందిస్తున్న అత్యున్నత విద్యా ప్రమాణా లకు నిదర్శనం అన్నారు. క్రమశిక్షణ, పారదర్శకతతో కళాశాల నిర్వ హించటం ద్వారా విజయం సాధ్యమైందని ప్రిన్సిపాల్ పీ బాబు, అకడమిక్ డైరెక్టర్ ఏ హరిబాబు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సైక్లిస్ట్ మృతి

చిలకలూరిపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట-వాడరేవు జాతీయ రహదారిపై పసుమర్రు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని బొందిలిపాలేనికి చెందిన టీకం శ్రీనివాస్ సింగ్(65) అనే వ్యక్తి మృతి చెందాడు. సైకిల్‌పై వెళ్తున్న అ తనిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. అక్కడికక్కడే అతడు మృ తి చెందగా.. హైవే సిబ్బంది అందించిన సమాచారం మేరకు చిలక లూరిపేట రూరల్ ఎస్ఐ జి.అనిల్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీ లించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

యడ్లపాడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై తిమ్మాపురం బ్రిడ్జి వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మేడికొండూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన దొప్పలపూడి హనుమకోటి(26) కేరళలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. మూడు రోజుల క్రితం అద్దంకికి చెందిన తన స్నేహితుని వివాహం నిమిత్తం స్వగ్రామానికి వచ్చాడు. స్నేహితులు చందు, రాజ్‌పుత్ దిలీప్‌కుమార్‌లతో కలసి బుల్లెట్ వాహనంపై అద్దంకిలో రాత్రి జరిగిన తన స్నేహితుని వివాహానికి హాజరయ్యాడు. మరుసటి రోజు ఆదివారం అద్దంకి నుంచి స్వగ్రామానికి బయలు దేరారు. వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయారు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ హనుమకోటి మృతిచెందాడు. మృతునికి ఇటీవలే నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం. మృతుని తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

నరసరావుపేటలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని నిర్మించండి: ఎంపీ లావు

న్యూఢిల్లీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా, నరసరావుపేటలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని అత్యవసరంగా ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు. సోమవారం లోక్‌సభలో 377 నియమం కింద ఆయన మాట్లాడారు. 'ఈఎస్ఐసీ పథకం ప్రస్తుతం రాష్ట్రంలో 13 లక్షల మంది ఉద్యోగులకు బీమాను అందిస్తోంది. 12 ఈఎస్ఐ ఆస్పత్రులు మాత్రమే క్రియాశీలకంగా పనిచేస్తూ 17 జిల్లాల్లోని కార్మికులకు ఆరోగ్య సేవలు అందిస్తున్నాయి. వచ్చే ఐదేళ్లలో ఈఎస్ఐసీ పథకం పరిధిలోకి వచ్చే జనాభా అంచనా వృద్ధిని పరిగణనలోకి తీసుకుని నరసరావుపేటలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని స్థాపించడానికి కేంద్ర ప్రభుత్వ ఆమోదం తెలపాలి' అని ఎంపీ కోరారు.

ఏఎన్‌యూ డిగ్రీ 2వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ కోర్సుల 2వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సోమవారం తాత్కాలిక వీసీ ఆచార్య కె. గంగాధరరావు విడుదల చేశారు. ఈ పరీక్షలకు 9,991మంది హాజరు కాగా వారిలో 5,642 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని చెప్పారు. ఈ సందర్భంగా ఏసీఈ ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫలితాలకు సంబంధించి రీవాల్యూయేషన్, పర్సనల్ వెరిఫికేషన్‌కు ఆగస్టు 11వ తేదీలోగా రూ.1,490 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడిలో... రెండు రైళ్లకు నిలుపుదల తొలగింపు

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నిత్యం రాత్రి వేళ గుంటూరు మీదగా పిడుగురాళ్ల, నడికుడి మీదగా సికింద్రాబాద్‌కు ప్రయాణించే చెన్నై, నారాయణాద్రి, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లకు ఆగస్టు నెల మొదటి వారంలో వివిధ తేదీల నుంచి పైన పేర్కొన్న స్టేషన్లలో నిలుపుదల సదుపాయాన్ని రైల్వే శాఖ తొలగించింది. చెన్నై, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లకు అయితే సత్తెనపల్లి స్టేషన్‌లో కూడా నిలుపుదల తీసేశారు. చెన్నై ఎక్స్‌ప్రెస్ ఆగస్టు మూడో తేదీ నుంచి గుంటూరులో బయలుదేరిన తర్వాత చర్లపల్లి వరకు ఎలాంటి స్టాపేజ్ లేకుండా రైల్వే టైంటేబుల్‌ని సవరించారు. విశాఖ ఎక్స్‌ప్రెస్‌కి అయితే ఈ నెల 5వ తేదీ నుంచి గుంటూరు తర్వాత సికింద్రాబాద్‌లోనే నిలుపుదల కల్పించారు. నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌కి మాత్రం సత్తెనపల్లిలో స్టాపేజ్‌ని కొనసాగిస్తూ పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడలో తొలగించారు. దీనిపై ప్రయాణీకులు ఫిర్యాదులు చేయడంతో విషయాన్ని తాము హెడ్‌క్వార్టర్స్‌కు నివేదిస్తామని రైల్వే అధికారులు సమాధానాలు ఇస్తున్నారు.

గంజాయి కేసులో నిందితులకు జైలు

కర్లపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసులో నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ మొదటి తరగతి అదనపు జడ్జి వీ.ఎల్‌పి సత్యవతి సోమవారం తీర్పునిచ్చారు. బాపట్ల జిల్లా కర్లపాలెం మండల కేంద్రం పాత చేపల మార్కెట్ సమీపంలో గంజాయి విక్రయిస్తూ 2014లో నిందితులు పట్టుబడ్డారు. దాసరి శ్రీనివాసరావుకు సంవత్సరం జైలు, రూ.10వేలు జరిమానా, గాలం పాపారావుకు నాలుగేళ్ల జైలు, రూ.10వేలు జరిమానా, పోతురాజు అప్పలనాయుడుకు నాలుగేళ్ల జైలు, రూ.10వేల నగదు జరిమానా విధిస్తూ.. జడ్జి తీర్పును వెలువరించారని కర్లపాలెం ఎస్సై రవీంద్ర తెలిపారు. మరో నిందితుడు తోకల పిచ్చయ్య(71) మృతి చెందాడని చెప్పారు. నిందితులకు జైలు శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకున్న పోలీసు అధికారులను కోర్టువిధులు నిర్వహించే సిబ్బందిని ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు.

కుడికాల్వకు నీటి విడుదల

(5వ పేజీ తరువాయి)

విడుదల చేయనున్నారు. ముగ్గురు మంత్రులు కార్యక్రమానికి హాజరవుతున్నట్లు సదరు ఇంజనీరు తెలిపారు. సాగర్ డ్యాంకు 1,47,195 కూసెక్కల వరద ప్రవాహం వస్తోంది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా పులిచింతలకు నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వలతో పాటు సాగర్ నుంచి దిగువకు 42,913 కూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా 585 అడుకులకు చేరుకుంది. ఇంకా ఐదు అడుగులకు చేరితే.. డ్యాం పూర్తిగా నిండుతుంది. నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా 297 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది.

పులిచింతలకు 25 వేల కూసెక్కులు

సాగర్ నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా పులిచింతల జలాశయానికి 25 వేల కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం నీట్టి మట్టం 175 అడుగులు కాగా సోమవారం 160.3 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలకు గాను 25.9 టీఎంసీలకు చేరింది. మరో 19.87 టీఎంసీల నీరు వస్తే పులిచింతల నిండుతుంది. మరో మూడు రోజుల్లో పులిచింతల డ్యాం కూడా నిండుతుందని జలవనరుల శాఖ అధికారుల అంచనాగా ఉంది. దీంతో ఈ నెలలోనే పులిచింతల గేట్లు తెరచుకోనున్నాయి.

పుడమ్మ.!

(5వ పేజీ తరువాయి)

రైతులకు వ్యవసాయ అధికారులు తెలియజేస్తున్నారు. సేంద్రీయ కార్బన్‌ను పచ్చిరొట్ట సాగు వల్ల అధిగమించవచ్చని వారు చెబుతున్నారు.

స్థూల, సూక్ష్మ పోషకాలు రెండూ ముఖ్యమే..

భూసారంలో స్థూల, సూక్ష్మ పోషకాలు రెండూ ముఖ్యమే. ఇవి పుడమిలో పుష్కలంగా ఉంటేనే పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. సేంద్రియ ఎరువుల వినియోగం తగ్గిపోవడంతో.. సేంద్రియ కర్బనం భూమిలో లోపిస్తోంది. గతంలో రైతులకు పాడి ఉండేది. పొలంలో పశువుల ఎరువును చల్లి దుక్కిదున్నేవారు. ఇది భూసారం పెంచేది. పదేళ్లుగా పాడిని రైతులు వదిలేస్తుండడంతో.. పశువుల ఎరువు పొలానికి వినియోగించే పరిస్థితి లేదు. రసాయన ఎరువును మోతాదుకు మించి పంటలకు వినియోగిస్తుండటంతో భూసారం తగ్గిపోతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జీలుగ, జనుము వంటి పచ్చిరొట్టను కూడా సాగు చేయడాన్ని రైతులు విస్మరించారు. సూక్ష్మపోషకాల లోపానికి ఇది కూడా ఒక కారణంగా ఉంది.

ప్రభుత్వం వైపు చూపు

గత తెలుగుదేశం ప్రభుత్వంలో సూక్ష్మ పోషకాలను ఏటా పంటల సాగుకు ముందే రాయితీపై పంపిణీ చేసేవారు. వైసీపీ పాలనలో సూక్ష్మ పోషకాల పంపిణీకి మంగళం పాడారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం భూసార పరీక్షలను పరిగణలోకి తీసుకొని.. ఎలాంటి సూక్ష్మ పోషకాల అవసరం ఎక్కడెక్క ఉందో.. అక్కడ రాయితీపై వాటిని పంపిణీ చేయాలని అన్నదాతలు విన్నవిస్తున్నారు. ఎకరాకు జింక్ 20 కిలోలు వినియోగిస్తే లోపాన్ని సరిచేయవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. జింక్ 20 కిలోలలు మార్కెట్‌లో రూ.1,200 నుంచి రూ.1,300 వరకు ఉంది. ప్రధానంగా వరి, మొక్కజొన్న, పత్తి, కంది, మిరప పంటలను రైతులు సాగు చేపట్టారు. అన్నదాతలు సూక్ష్మపోషకాల పంపిణీ కోసం ప్రభుత్వం వైపు చూస్తున్నారు.

హలో.. మాస్టారూ..!

(5వ పేజీ తరువాయి)

చేసుకుంటారు. ఇందుకు ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్ ధృవీకరణ పత్రం రుణ దరఖాస్తుకు జత చేస్తే సరిపోతుంది. అయితే జడ్పీలోని సిబ్బంది మాత్రం ప్రభుత్వ సివిల్ సర్జన్ సర్టిఫికెట్ మాత్రమే అనుమతిస్తామని ఇది లేకపోతే రుణం మంజూరు చేయమని తిరకాసు పెడుతున్నారు. మరోవైపు కాసులు చెల్లిస్తే మాత్రం అన్నింటికీ ఓకే అని చెబుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ఉపాధ్యాయులకు నోటీసులు..

ఇటీవల పీఎఫ్ చందాల విషయంలో తేడాలు ఉన్నాయంటూ 55 మంది ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులకు నోటీసులు జారీ అయ్యాయి. ఒక నెలలో ట్రెజరీ నుంచి పీఎఫ్ చందా జమ కాకపోతే ఆ మొత్తం రెం డో నెలలో కలిపి జమ చేస్తారు. కొన్ని కారణాల వల్ల ఉపాధ్యాయులు సెలవులో ఉంటే చందా జీరోగా ఉంటుంది. ఇలాంటి తేడాలను ఆడిట్ సిబ్బంది సరిచేయకుండా నోటీసులు జారీ చేయడం ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తున్నారు.

ఆందోళనకు సిద్ధం..

ఇలా వివిధ కారణాలతో ఉపాధ్యాయులను విశ్రాంత ఉపాధ్యాయులను జడ్పీలోని పీఎఫ్ ఆడిట్ సిబ్బంది వేదనకు గురి చేస్తున్నారు. ఈ బాధలు భరించలేక ఇటీవల కొంతమంది జడ్పీ సీఈఓకు ఫిర్యాదు చేశారు. అయినా సమస్య పరిష్కారం కాలేదని, ఇక తాము జడ్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తామని సీఈఓకు స్పష్టం చేశారు. జడ్పీలోని పీఎఫ్ ఆడిట్ విభాగాల సిబ్బంది ఉపాధ్యాయులను, విశ్రాంత ఉపాధ్యాయులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నారు.

వరికపూడిశెల ముందడుగు.!

(5వ పేజీ తరువాయి)

అన్ని అనుమతులు వచ్చేశాయి. నిధుల కేటాయింపులు జరగడంతో ప్రాజెక్ట్ నిర్మాణం పట్టాలెక్కనుంది.

సాకారం కానున్న కల..

మాచర్ల, వినుకొండ నియోజకవర్గాల ప్రజలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన వరికపూడిశెల ప్రాజెక్టు పనులు వైసీపీ ప్రభుత్వ హయాంలో ముందుకు సాగలేదు. ప్రాజెక్టు నిర్మాణం రెండు దశల్లో చేపట్టి వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి మండలాల్లో సాగు నీరు ఇచ్చేందుకు రూపొందించారు. వెల్దుర్తి మండలంలోని 24,900 ఎకరాలకు సాగునీరు అందించేందుకు మొదటి దశ నిర్మించాలి. మొదటి దశ పనులు కోసం నిధులు కేటాయించారు. రెండవ దశలో పనులు సర్వే దశలో ఉన్నాయి. ప్రాజెక్టును పూర్తి చేస్తే వెల్దుర్తితో పాటు దుర్గి, బొల్లాపల్లి మండలాల్లోని 48,236 ఎకరాలకు సాగు నీరు అందుతుంది. త్వరలోనే పనులు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం సమాయత్తమవుతోంది. అధికారంలోకి వచ్చాక మూడేళ్లలో వరికపూడిశెల నిర్మిస్తామని యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ మాచర్ల, వినుకొండ నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కూడా ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చారు. ఈ దిశగా వారు కృషి చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

43,883 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 46,138 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 43,883 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,671 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	11000
334	9500	13000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13300	334	9500	12600
273	----	-----	నెంబరు. 5	10000	13400
341	10000	13600	273	----	----
4884	----	----	341	10000	13800
సూపర్ 10	----	----	4884	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	13800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	12400
బ్యాడిగి	10000	12600	దేవనూరు డీలక్స్	----	----
దేవనూరు డీలక్స్	10000	12400	తాలుకాయలు	4500	7000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్ర|| 99854 11225 | 99854 01330
99854 01690 | 99854 77867

గ్రీవెన్స్‌లో రెండు దరఖాస్తులు

ముప్పాళ్ళ, జూలై 28(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు రెండు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నగేష్ తెలిపారు. అడంగల్‌లో పేరుమార్పు కొరకు ఒకరు దరఖాస్తు చేసుకోగా, ఇతర సమస్యల కోరుకు మరొకరు దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ అన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి తదితరులు

ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలి

● డీడీఏ శివకుమారి

మాచవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపితే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందటానికి అవకాశం ఉందని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం శివ కుమారి రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని కొత్తగణేషునిపాడు రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు శిక్షణా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ రైతులు వివిధ పంటల్లో మేలైన సాగు పద్ధతులు, తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యల గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం అరుణ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంటల బీమా తప్పక చేయించుకోవాలన్నారు. కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు కార్డులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో రామమ్మ, ఇన్‌చార్జ్ సర్పంచ్ పల్లా నరేంద్ర, పీఎస్ అంబారావు, రైతు సేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



పార్వతమ్మకు బియ్యం అందిస్తున్న టీడీపీ పట్టణ నేతలు

వృద్ధురాలికి బియ్యం పంపిణీ

పిడుగురాళ్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఒంటరి వృద్ధురాలికి టీడీపీ నేతలు సోమవారం బియ్యం పంపిణీ చేశారు. నాలుగు రోజుల క్రితం 6వ వార్డులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒంటరి వృద్ధురాలు గలబా పార్వతమ్మ, పూటగడవటం కష్టంగా వుందని, పట్టించుకునేవారు లేరని ఎమ్మెల్యే ఎదుట కన్నీటి పర్యంతమైంది. దీంతో ఎమ్మెల్యే యరపతినేని కూటమి నేతలు పాండురంగ శ్రీను, వడ్డవల్లి సాంబశివరావు, పిల్లి చెన్నారావు, సయ్యద్ అమీర్‌అలి, బిజిలి వెంకటరావు, జమ్మిశెట్టి రామకృష్ణ, బిజిలి ఇస్రాయేలు ద్వారా పార్వతమ్మకు బియ్యం పంపిణీ చేయించారు.

రేపు నగర పంచాయతీ సమావేశం

దాచేపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ సమావేశం బుధవారం జరుగుతుందని కమిషనర్ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. వివిధ అంశాలపై చర్చ జరుగుతుందని, కౌన్సిలర్లు హాజరు కావాలని కోరారు.

దేవాలయంలో చోరీ

పిడుగురాళ్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డు సమీపంలోని శ్రీఅభయ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయం వెనుక వైపు గుండా ప్రవేశించి విద్యుత్ ఫ్యూజులు పీకేసి కరెంటు సరఫరా ఆగిన తరువాత సిసి కెమెరాలను ధ్వంసంచేసిన అనంతరం దేవాలయంలోని మూడు హుండీలను పగులగొట్టినట్లు నిర్వాహకులు ఆలేటి మల్లికార్జునరావు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారు రూ20వేల నగదు, రూ.40వేల విలువైన సిసి కెమెరాలు ధ్వంసమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

మాలమహానాడు అధ్యక్షుడిగా చంద్రశేఖర్

విజయపురిసౌత్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విజయపురిసౌత్ మాలమహానాడు అధ్యక్షుడిగా బొబ్బిలి చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక మాలమహానాడు చీఫ్ అడ్వయిజర్ కాంట్రాక్టర్ లక్ష్మయ్య ఆధ్వర్యాన ఫిల్టర్ హౌస్ వద్ద నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా పురాణం శ్రీనివాసరావు, కార్యదర్శిగా పిల్లి రాజబాబు, జాయింట్ సెక్రటరీగా పత్తి రామచంద్రరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కట్టారాజు, జనరల్ సెక్రటరీగా చింతమళ్ల శ్రీనివాస్, కోశాధికారిగా కోదముళ్ల వెంకటనారాయణలు ఎన్నికయ్యారు. అనంతరం టీడీపీ విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, కాంట్రాక్టర్ లక్ష్మయ్యలు నూతన కమిటీని అభినందించారు. కార్యక్రమంలో మల్లికార్జున, గంగాధర్, నాగెండ్ల శ్రీను, జి కోటేశ్వరరావు, గుంటి ఆండ్రూస్ బాబు, రవి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీచర్లను బోధనకే పరిమితం చేయాలి

రెంటచింతల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కర్మయోగి యాప్, పీ-4 బాధ్యతల నుంచి టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని.. టీచర్లను బోధనకే పరిమితం చేయాలని యూటీఎఫ్, ఎస్టీయూ నేతలు వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనల్లో పేర్కొన్నారు. పీ 4 కార్యక్రమం ఉపాధ్యాయులకు అప్పగించడం బోధనేతర పనుల కిందకే వస్తుందన్నారు. అలాగే కర్మయోగి అనే యాప్‌ను ఉపాధ్యాయులపై బలవంతంగా రుద్దుతున్నారని, ఇందులో ఆన్‌లైన్ కోర్సులో ప్రతి ఉపాధ్యాయుడు 56 వీడియోలు పూర్తి చేయాలని పేర్కొనడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో యూటీఎఫ్‌కు చెందిన నాసరయ్య, జాన్ విజయ్‌రాజ్‌కుమార్, డాక్టర్ చిన్నమ్మ, ఎస్టీయు జిల్లా కౌన్సిల్ మెంబర్ లేళ్ల శ్రీనివాసరావు, చంద్రశేఖర శర్మ, అమలబాబు, అహ్మద్ ఉన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు

ముప్పాళ్ళ, జూలై 28(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాల బారిన పడతారని ఎస్‌ఐ సోమేశ్వరరావు అన్నారు. మండలంలోని మాదలలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ దరించాలన్నారు.

ట్రైనీ ఎస్‌ఐగా పవన్‌కుమార్

పిడుగురాళ్ల, జూలై 28(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌లో ట్రైనీ ఎస్‌ఐగా నియమితులైన కీర్తిపాటి పవన్‌కుమార్ సోమవారం పట్టణ సీఐ వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శిక్షణ కాలంలో విధుల్లో ఎంతో నేర్పుగా ఉండాలని సీఐ సూచించారు.



సీఐ వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలిసిన ట్రైనీ ఎస్‌ఐ పవన్‌కుమార్

సుపరిపాలనతో రెట్టింపు సంక్షేమం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సుపరిపాలన ద్వారా ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు రెట్టింపు సంక్షేమాన్ని అందిస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని కందులవారిపాలెంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో ఉన్న దివంగత ఎన్‌టీఆర్, పసుపులేటి వెంగళరెడ్డిల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పసుపులేటి శివమల్లారెడ్డి, ఊటుకూరి కోటిరెడ్డి, పాములపాటి వెంకటరెడ్డి, జెట్టి కోటేశ్వరరావు, చప్పిడి నరసింహారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



కందులవారిపాలెంలో కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా

31 లోపే ఇంటర్ అడ్మిషన్‌లు..

బెల్లంకొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఈనెల 31వ తేదీ లోపే ఇంటర్మీడియట్ అడ్మిషన్‌లు జరుగుతాయని బెల్లంకొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు ఉచిత పుస్తకాలతోపాటు కాస్మోటిక్స్, మధ్యాహ్న భోజన పథకం అందిస్తున్నామని పేర్కొన్నారు.

గ్రీవెన్స్‌లో 4 అర్జీలు

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో రైతుల నుండి 4 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ డానియేలు తెలిపారు. డిజిటల్ సైన్ తదితర సమస్యలపై వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. గ్రీవెన్స్‌లో డీటీ రాజు, ఆర్‌ఐ శిరోమణి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పుస్తకాలు, ఆట వస్తువుల పంపిణీ

అచ్చంపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్నేహ హస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు పుస్తకాలు, ఆట వస్తువుల పంపిణీ చేశారు. మండలంలోని పలు పాఠశాలలను స్నేహ హస్తాల ఫౌండేషన్ దత్తత తీసుకున్న నేపథ్యంలో ఫౌండర్ కూరపాటి శివరామ్(లండన్) సోమవారం పలు పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆట వస్తువులు, ఎంట్రన్స్ పుస్తకాలను విద్యార్థులకు అందించారు. ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో ప్రజల్లో సంతృప్తి

క్రోసూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఏడాదిలో కూటమి పాలనలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నారని క్రోసూరు మండల టీడీపీ అధ్యక్షుడు మొగల్‌జాన్ అన్నారు. సోమవారం ఆవులవారిపాలెం, పెరికపాడు, పెరికపాడుతండాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సంక్షేమం, అభివృద్ధితో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు

సత్తెనపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 9వ వార్డులో సోమవారం టీడీపీ నేతలు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సంవత్సర కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పథకాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బలిజేపల్లి సురేష్‌కుమార్, వీర్లపాటి శ్రీనివాసరావు, తేరగండ్ల కిరణ్ కుమార్, మాలపాటి నవీన్ కుమార్, చింతపల్లి అజయ్ కుమార్, నవనీతరాజు, బిళ్లా బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

● సీపీఐ ఏరియా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి

మాచర్లటౌన్, జూలై 28 ఆంధ్రజ్యోతి: పట్టణంలో మంగళవారం జరగనున్న సీపీఐ ఏరియా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి కోరారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడేది సీపీఐ అన్నారు. మహాసభలకు పలువురు ప్రముఖులు హాజరవుతారన్నారు. పట్టణంలో ర్యాలీ జరిపి రైల్వేస్టేషన్ రోడ్డులోని రామాలయంలో మహాసభలు ఉంటాయన్నారు. సమావేశంలో మిద్దెపోగు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కోడెల పేరు ధ్వంసం

సత్తెనపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తాలూకా సెంటర్‌లో ఇటీవల ఏర్పాటుచేసిన దివంగత డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహం వద్ద దిమ్మెపై ఉన్న పేరును ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టి తొలగించారు. దీనిపై పట్టణ పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ నేతలు, కోడెల అభిమానులు కొంత మంది సోమవారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



కోడెల విగ్రహంపై శివప్రసాదరావు పేరును తొలగించిన దృశ్యం

వాహనాల తనిఖీ

సత్తెనపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సోమవారం పల్నాడు జిల్లా రవాణా శాఖ అధికారి బీ సంజీవకుమార్ తన సిబ్బంది, ఆర్టీసీ సిబ్బందితో కలసి పట్టణంలోని చెక్‌పోస్టు సెంటర్‌లో ఆటోలను, ద్విచక్రవాహనాలను తనిఖీ చేశారు. ప్రయాణీకులను తీసుకువెళ్తున్న ఆటోల్లో సరుకు రవాణా చేయటంపై, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలను నడుపుతున్న వారిపై కేసులు నమోదుచేశారు. రూ 37,500 అపరాధ రుసుం విధించారు.

నకరికల్లు రైస్ మిల్లులో చోరీ

నకరికల్లు, జూలై 28(ఆంధ్రజ్యోతి): నకరికల్లులోని శ్రీనివాస రైస్ మిల్లులో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం రైస్‌మిల్లు నిర్వాహకులు రోజువారి లావాదేవీలు పూర్తిచేసుకున్న తరువాత రూ.2.43 లక్షలను బీరువాలో ఉంచారు. గుర్తు తెలియని వ్యక్తులు వెనుక నుంచి అద్దాలను పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. గల్లా పెట్టెలో ఉన్న బీరువా తాళవచెవి తీసుకొని బీరువాలో ఉన్న రూ 2.43 లక్షలను అపహరించుకుపోయారు. ఇదే గ్రామంలోని వినాయక మిల్లు వద్ద కూడా ఆగంతకుడు దొంగతనానికి ప్రయత్నించినట్లు తెలుస్తుంది. మోటారు బైక్ ప్లేటును తొలగించి మిల్లులోని సీసీ కెమేరా తీగలను కత్తిరించి దొంగతనానికి ప్రయత్నించాడు. కానీ అక్కడ వీలు కాలేదు. రైస్ మిల్లుకు ముందు భాగాన ఒక వ్యాపార దుకాణంలో సీసీ కెమేరాలో ఈ దృశ్యాలు రికార్డు కావటంతో ఆ నిందితుడే ఈ దొంగతనానికి పాల్పడి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. కాళంగి జ్వాలా నరసింహారావు ఫిర్యాదు మేరకు నకరికల్లు ఎస్‌ఐ సీహెచ్ సురేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

విజయపురిసౌత్, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంధ్రప్రదేశ్ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులు నేపాల్‌లోని పొఖ్రాలో నిర్వహించిన ఇండో - నేపాల్ ఇంటర్నేషనల్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటారు. రన్నింగ్ విభాగంలో జొన్నలగడ్డ నాగ రవీంద్ర (200 మీటర్లు), అంజినాయక్ (100 మీటర్లు), హరికృష్ణ నాయక్ (లాంగ్‌జంప్) బంగారు పతకాలు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ షేక్ నయీమ్‌భాను అభినందించారు.



బంగారు పథకాలు సాధించిన గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులు

బోధనలో అలసత్వం వహిస్తే చర్యలు

● తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లునాయక్

కారంపూడి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు బోధనలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. మండలంలోని మోడల్ స్కూల్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో సౌకర్యాలు, విద్యార్థుల హాజరు, బోధన, ఇతర నిర్వహణాంశాలను పరిశీలించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు సరైన బోధన అందించకపోవడంతో వారిపై తహసీల్దార్ అసహనం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల వసతులను పరిశీలిచారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే తమకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో - 2 రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

పెదకూరపాడు, జూలై 28(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, ప్రభుత్వ కార్యదర్శి ఎస్ సత్యనారాయణను సోమవారం రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ కలసి వినతిపత్రం అందించారు. జీవో నెంబరు 13, 14లను అమలు చేయాలని, ప్రభుత్వం నిర్మాణంచేసే అన్ని కాంప్లెక్స్‌ల నందు బార్బర్ షాపులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వ స్థలాల్లో బార్బర్ షాపులు నడుపుకొనేందుకు స్థలాలు కేటాయించాలని కోరారు. దేవాలయ ట్రస్ట్ బోర్డుల్లో ట్రస్ట్ బోర్డు మెంబర్లుగా వేయాలని కోరారు.



ప్రభుత్వ కార్యదర్శి సత్యనారాయణకు వినతిపత్రం అందిస్తున్న గంగాధర్

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

సత్తెనపల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరానికి లయన్స్ క్లబ్ పట్టణ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. నూతన అధ్యక్షునిగా బండ్లమూడి వీరాంజనేయులు, కార్యదర్శిగా ముద్దా రమేష్, కోశాధికారిగా బత్తుల రోశయ్య, ఉపాధ్యక్షులుగా పెద్దింటి వెంకటేశ్వర్లు, గుర్రం మహేశ్వరరావు, కే రాజశేఖర్, సహాయ కార్యదర్శి చోట పద్మ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పేద మహిళలకు కుట్టు మిషన్, వృద్ధులకు చీరలు, దుప్పట్లు, విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు, కంభాల వెంకటేశ్వరరావు, వైసీ మురళీకృష్ణ, మంచికంటి వెంకటేశ్వరరావు, కొండవీటి రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకొనేందుకే పంటల బీమా

సత్తెనపల్లి రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని ప్రవేశ పెట్టినట్టు ఏవో డీబీ సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని గుడిపూడిలో సోమవారం పంటల బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. పంట నష్టపోతే వచ్చే నగదు మొత్తాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో గుడిపూడి పీఏసీఎస్ ఛైర్మన్ గద్దె అప్పారావు, మేడూరి రవీంద్రబాబు, కొనకంచి పుల్లారావు, బీమా కంపెనీ ప్రతినిధులు సుబ్బారావు, లింగయ్య, ఏఈవో జానీబాషా, వీహెచ్‌ఏ శాంతి తదితరులు పాల్గొన్నారు.

చౌక డిపోల్లో రికార్డుల తనిఖీ

దుర్గి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): దుర్గిలోని చౌక డిపోలను సోమవారం సీఎస్‌డీటీ షేక్ బాషా తనిఖీ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానం అమలు చేసే క్రమంలో దుర్గిలోని 1, 29, 33 నంబర్లు గల చౌక డిపో షాపులను తనిఖీ జరిపారు. తూనికలు, రికార్డులు, స్టాక్‌లను పరిశీలించారు. షాపుల వద్ద స్టాక్ వివరాలు బోర్డులో ఉంచాలని, రికార్డులు ఎప్పటికప్పుడు రాసుకోవాలని, రెండు కాటాలు ఉండకూడదని డీలర్లకు సూచించారు. 65 సంవత్సరాలు నిండిన సిటిజెన్‌లకు ఇంటి దగ్గరకు వెళ్లి సరుకులు ఇవ్వాలన్నారు. వినియోగదారులను చౌక డిపోల ద్వారా సరకులు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట వీఆర్‌ఏ ప్రకాష్ ఉన్నారు.



దుకాణాలను తనిఖీ చేస్తున్న సీఎస్‌డీటీ బాషా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పెదకూరపాడు, జూలై 28(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను టీడీపీ జిల్లా నాయకులు పంపిణీ చేశారు. గుంటూరులోని పెదకూరపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురికి ఈ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్యాంపు కార్యాలయ ప్రతినిధి నరిశెట్టి బాలరాజు, టీడీపీ జిల్లా నాయకులు భాష్యం ఆంజనేయులు, భాష్యం శంకరరావు తదితరులు పాల్గొన్నారు. పెదకూరపాడులో సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, గల్లా బాబూరావు, బెల్లంకొండ రామగోపాలరావు, టీడీపీ మండల నేతలు మద్దినేని వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

12న వేపకంపల్లి ఎంపీటీసీ ఎన్నిక

కారంపూడి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. కారంపూడి మండలం వేపకంపల్లి ఎంపీటీసీ స్థానం ఖాళీగా ఉండడంతో ఆగస్టు 12వ తేదీన ఎన్నిక జరపాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. వేపకంపల్లి ఎంపీటీసీ కోకా అక్కమ్మ మృతిచెందడంతో ఆ స్థానం ఖాళీ అయింది. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీచేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు.

రేపటి నుంచి నామినేషన్లు...

వేపకంపల్లి ఎంపీటీసీ స్థానానికి ఈనెల 30 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆగస్టు 2వ తేదీన స్క్రూటినీ ఉంటుందన్నారు. 3వ తేదీన అభ్యంతరాలుంటే ఆర్డీవోకు లిఖిత పూర్వకంగా తెలియజేయడం, 5వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ ఉపసంహరణ ఉంటుందన్నారు. 12వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఎన్నిక జరుగుతుందన్నారు. అవసరమైతే 13వ తేదీన రిపోలింగ్, 14వ తేదీన కౌంటింగ్ ఉంటుందని ఎంపీడీవో చెప్పారు.

అందుబాటులో మాస్టర్ ప్లాన్ ల్యాండ్ యూజ్ మ్యాప్

● మున్సిపల్ కమిషనర్ వేణుబాబు

మాచర్ల రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘ నోటీస్ బోర్డులో మాస్టర్ ప్లాన్ ల్యాండ్ యూజ్ మ్యాప్ అందుబాటులో ఉంచినట్లు మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని సర్వే నంబర్ల భూ వినియోగాలను వివరించే మ్యాప్‌ను మున్సిపాలిటీ, ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామన్నారు. దీనిపై ఏవైనా అభ్యంతరాలుంటే ఆగస్టు 26వ తేదీలోపు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని కోరారు.

ఎరువుల వాడకాన్ని తగ్గించండి

● డీఆర్‌సీ డీడీఏ ఎం శివకుమారి

నకరికల్లు, జూలై 28(ఆంధ్రజ్యోతి): రైతులు ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, పర్యావరణాన్ని కాపాడాలని పల్నాడు జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం శివకుమారి కోరారు. సోమవారం నకరికల్లు మండలం దేచవరంలో రైతు సేవా కేంద్రంలో రాష్ట్రీయ కృషివికాస్ యోజనలో భాగంగా రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో శివకుమారి మాట్లాడుతూ రైతులు వరిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను తెలిపారు. జీవన ఎరువులను వినియోగించే విధానాన్ని రైతులకు తెలిపారు. కాంప్లెక్స్ ఎరువులు పైపాటుగా వాడకూడదని సూచించారు. పురుగుమందులను వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. రైతులంతా ప్రధానమంత్రి పసల్ బీమా యోజన పథకంలో చేరి వరి పంటకు బీమా చేయించుకోవాలని సూచించారు. ఎకరాకు రైతు వాటాగా రూ.80 చెల్లించాలన్నారు. బీమా ప్రీమియంను ఆగస్టు 15వ తేదీలోగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏవో ఎం అరుణ, నకరికల్లు ఏవో కోడిరెక్క దేవదాసు, ఏఏలు పీ పవన్‌కుమార్, రవిబాబు, హనుమంతరావు పాల్గొన్నారు.

గ్రామ సేవకుల మండల కార్యవర్గం ఏర్పాటు

అచ్చంపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండల గ్రామ సేవకుల కార్యవర్గం ఏర్పాటుచేశారు. మండల అధ్యక్షుడిగా ఎన్నికైన వై సత్తయ్య డివిజన్ ప్రధాన కార్యదర్శి కోట సుబ్బారావు సమక్షంలో గ్రామ సేవకుల ఎన్నికలు నిర్వహించారు. గ్రామ సేవకుల మండల ఉపాధ్యక్షుడిగా ఎం కిషోర్, ట్రెజరర్‌గా ఎస్‌కే జిలానీని ఎన్నుకున్నారు.

వెంకటాయపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు

బెల్లంకొండ, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాయపాలెంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శ్రీనివాసనాయక్, శ్రీరామమూర్తి ఇంటింటికి వెళ్ళి కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన శానిటేషన్ సామగ్రి

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 48 పాఠశాలలకు సంబంధించి శానిటేషన్ సామగ్రి సోమవారం వచ్చాయి. బాత్‌రూమ్ క్లీనర్, శానిటైజర్, టాయిలెట్ క్లీనర్, ఎయిర్ ఫ్రెషనర్‌కు సంబంధించి 3,152 లీటర్లు లిక్విడ్ వచ్చాయి. ఈ సామాగ్రి అమరావతి, క్రోసూరు, అచ్చంపేట మండలాలకు రాగా ముందుగా అమరావతిలో 3,152 లీటర్లు అన్‌లోడ్ చేశారు.

ఉచిత కంటి పరీక్షలు

దుర్గి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ రామలింగారెడ్డి హాస్పిటల్ సౌజన్యంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 184 మందికి కంటి పరీక్షలు జరిపి చుక్కల మందు అందించారు. తలనొప్పి, కంటిచూపు తగ్గినా, కంటి మసకలు వచ్చినా, కంటి వెంట నీరు కారుతున్నా, కళ్ల మంటలు వచ్చినా పరీక్షలు చేస్తామని వైద్యులు తెలిపారు. అవసరమైతే ఆపరేషన్ కూడా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె వేణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిపోను సందర్శించిన డీపీటీవో అజితకుమారి

మాచర్లటౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ డిపోను సోమవారం డీపీటీవో అజితకుమారి సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు జరుగుతున్నందున అధికారులు ఇందుకనుగుణంగా బస్సులను నడపాలన్నారు. బస్సుల కండీషన్ గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి నింపుకునేందుకు పరిష్కారం చూపండి

మాచర్ల రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో గృహాలు నిర్మాణానికి లబ్ధిదారులకు మట్టి లేక ఇబ్బందులు పడుతున్నారని, పరిష్కారం చూపాలని హౌసింగ్ డీఈఈ బాలాజీనాయక్ సోమవారం తహసీల్దార్ కిరణ్ కుమార్‌ను కోరారు. సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీనిచ్చారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మరియదాసు, సిబ్బంది పాల్గొన్నారు.



1500 మీటర్ల రన్నింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థులు

రన్నింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

దాచేపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని భవ్య సిమెంట్ డీఏవీ పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. సోమవారం హెచ్‌ఎం ఎస్ మధుసూదనరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ - 2 క్రీడల పోటీల్లో మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ గేమ్స్ ఈనెల 25, 26 తేదీల్లో ఇబ్రహీంపట్నంలో జరిగిన పోటీల్లో వీరు పాల్గొన్నారు. 800, 1500 మీటర్ల రన్నింగ్‌లో వెంకటేష్ బంగారు పతకం, 200మీటర్ల విభాగంలో భరత్‌చంద్ర సిల్వర్, 400 మీటర్ల రన్నింగ్ విభాగంలో లోకేశ్ బ్రాంజి పతకాలను సాధించారు. లాంగ్ జంప్‌లో శ్రీమాన్ బ్రాంజ్ మెడల్ సాధించారు. 4/100 మీటర్ల రిలే వెంకటేష్, శ్రీమాన్, లోకేశ్, భరత్‌చంద్ర మొదటి స్థానంలో గోల్డ్ మెడల్‌ను సాధించుకున్నారు. అండర్ - 17 అథ్లెటిక్స్ బాలుర విభాగంలో 4/100 మీటర్ల రిలేలో జయరామ్ రాహుల్, శివన్నారాయణ, గురు రాఘవ మోహన్ నాయక్ గోల్డ్‌మెడల్‌ను సాధించారు. 1500, 400 మీటర్ల రన్నింగ్‌లో శివన్నారాయణ, జయరామ్ రాహుల్ గోల్డ్‌మెడల్ సాధించారు. వీరిని భవ్య సిమెంట్ ఎండీ ఎస్ వెంకటరాజు అభినందించారు.



ప్రకృతి వ్యవసాయ శిక్షణా శిబిరంలో పాల్గొన్న కేరళ బృందం, ఇన్‌సెట్లో మాట్లాడుతున్న రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్

కేరళ బృందం ఫిదా..!

● ఏపీ రైతుల ప్రకృతి వ్యవసాయ పద్ధతులకు ప్రశంసలు

గుంటూరు సిటీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): 'ప్రకృతి వ్యవసాయానికి ప్రాణాధారం జీవవైవిధ్యం. 365 రోజుల పాటు పొలాన్ని పంటలతో కప్పి ఉంచడంలో.. రైతులే అత్యుత్తమ ఆవిష్కర్తలు, శిక్షకులు. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ నమూనాలను ఊహించిన దానికంటే ఉత్తమంగా రైతులు ముందుకు తీసుకువెళ్తున్నారు.' అని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్ కుమార్ పేర్కొన్నారు. కేరళ ప్రతినిధి బృందం మూడో రోజు శిక్షణలో భాగంగా గుంటూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు సిఫార్సు చేసిన పద్ధతులను మించి, కొత్త ఆవిష్కరణలు చేయడం ఎంతో ప్రేరణనిచ్చిందన్నారు. ప్రకృతి వ్యవసాయం ఒక సుస్థిర, వ్యాప్తి చెందగల రైతు ఆధారిత ఉద్యమంగా మారిందని కేరళ బృందం సభ్యులు అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రైతులు ప్రదర్శించిన వినూత్న పద్ధతులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పంటల వైవిధ్యం, నేల ఆరోగ్య నిర్వహణ, జీవ ఉత్ప్రేరక తయారీ వంటి అంశాలు వారిని ఆకట్టుకున్నాయి. రైతులు ప్రకృతి వ్యవసాయం సూత్రాలను అనుసరించడమే కాకుండా వాటిని మెరుగుపరుస్తూ ముందుకెళ్తున్నారని వారు పేర్కొన్నారు. సీనియర్ సలహాదారు డాక్టర్ వరప్రసాద్ ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేసి, ఏపీలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన శాస్త్రీయ అధ్యయనాలు, ఆధారాలను వివరించారు. సీనియర్ కన్సల్టెంట్ మహేశ్వరి మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం బహుముఖ దృష్టి కోణాన్ని కలిగి ఉందని, నేల నిర్మాణాన్ని బలపరుస్తుందన్నారు. సీనియర్ కన్సల్టెంట్ లక్ష్మీదుర్గా (వర్చువల్‌గా) మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా పోషక భద్రత సాధ్యమవుతుందన్నారు. పాఠశాలలు, అంగన్వాడీలకు రసాయన రహిత ఉత్పత్తులను అందించడం, ఆహార వైవిధ్యం పెంచడం ద్వారా పోషకాహార లోపాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. రైతు సాధికార సంస్థ సిబ్బంది డాక్టర్ డీవీ రాయుడు, జేబీఆర్ చక్రవర్తి, గోపిచంద్, వి.కృష్ణారావు సమావేశంలో బృందానికి తోడ్పడ్డారు.

ప్రయాణికుల జాగారం

● స్పెషల్ ట్రైన్స్ రాక గంటల తరబడి నిరీక్షణ

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల - వినుకొండ మధ్యన ఉన్న నెమలిపురి, రొంపిచర్ల రైల్వేస్టేషన్లలో ప్రయాణీకులు రాత్రి అంతా జాగారం చేయాల్సి వస్తోన్నది. నంబరు. 07189 నాందేడ్ - తిరుపతి రైలుని నడికుడి - శ్రీకాళహస్తి మార్గంలో పూర్తి అయిన వినుకొండ సెక్షన్‌లో ప్రవేశ పెట్టారు. ఈ రైలు ప్రతీ శుక్రవారం అర్ధరాత్రి 1 గంటకు నెమలిపురి రావాలి. అయితే ఇది తెల్లవారజామున 4 గంటలు దాటిన తర్వాతనే వస్తున్నది. ఈ కారణంగా తిరుపతి వెళ్లేందుకు టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొన్న ప్రయాణీకులు రాత్రి అంతా మేల్కొని స్టేషన్‌లో ఎదురు చూడాల్సి వస్తున్నది. ఈ రైలు తిరుపతికి మధ్యాహ్నం 12.30కి చేరుకొని 2.20 కల్లా శనివారం తిరుగు ప్రయాణం కావాలి. తిరుపతికి వెళ్లడమే రెండు గంటలకు పైగా ఆలస్యం అవుతుండటంతో ప్లాట్‌ఫాం మీదనే క్లీనింగ్ చేసి లోకో రివర్స్ చేస్తున్నారు. ఈ కారణంగా తిరుగు ప్రయాణమయ్యే రైలు నంబరు. 07190 తిరుపతి - నాందేడ్ స్పెషల్ రీషెడ్యూల్ చేయాల్సి వస్తున్నది. షెడ్యూల్ ప్రకారం ఈ రైలు రొంపిచర్లకు రాత్రి 10.25కు చేరుకోవాలి. రీషెడ్యూల్ కారణంగా అర్ధరాత్రి దాటాక 3.30కి వస్తున్నది. దాంతో నెమలిపురికి వెళ్లేసరికి మరో పావు గంటకు పైగా సమయం పడుతున్నది. ఈ నేపథ్యంలో ఆపరేటింగ్ అధికారులు షెడ్యూల్ ప్రకారం ఈ స్పెషల్ ట్రైన్‌ని నడిపేందుకు చర్యలు చేపట్టాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

పిచికారీ.. ప్రమాదం లేకుండా

● పురుగుమందు చల్లేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి
● ఊపిరితిత్తులు, క్యాన్సర్ బారిన పడే ప్రమాదం
● ఖరీఫ్ సీజన్ ప్రారంభంతో కలుపుమందులు వినియోగం



తెనాలిరూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగు ప్రారంభ సమయం కావడంతో పంటలసాగుకు భూములను శుభ్రం చేసే పనిలో రైతులు హడావిడిగా ఉన్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు తెరిపివ్వడంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. తెనాలి మండలంలో 18వేల ఎకరాల్లో వెద సాగుపనులు జరుగుతున్నారు. చేలు చుట్టూ ఉన్న గట్లు శుభ్రం చేసుకుని పంటపొలాల్లో ఉన్న గడ్డిజాతి మొక్కలను ఏరివేసే పనిలో నిమగ్నమయ్యారు. గతంలో కూలీలతో చేయించే ఈ పనులను సాగుకు ఖర్చు భారంగా మారుతుందన్న ఉద్దేశంతో అధిక సంఖ్యలో కలుపు నివారణ మందుల వైపు మొగ్గుచూపుతున్నారు. అయితే ఈ రసాయనాలు ప్రమాదకరమన్న విషయాన్ని మరిచి వీటిని పిచికారి చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే అనారోగ్యసమస్యల బారిన పడే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఏటా కలుపు నివారణ, పురుగు మందులు పిచికారి చేసే వారు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో అనేక అనారోగ్య సమస్యల బారినపడి మృతి చెందుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య శాఖ సైతం జరిపిన సర్వేలో వెల్లడైంది.



రసాయనాలు కలిపే సమయంలో తప్పనిసరిగా గ్లౌజులు ధరించాలి

కలుపు లేదా పురుగు మందుల రసాయన ద్రావణాన్ని కలిపే సమయంలో తప్పనిసరిగా చేతులకు గ్లౌజులు ధరించాలి. రసాయనం కలపడం పూర్తి అయ్యేంత వరకూ ఎట్టిపరిస్థితుల్లో తినుబండారాలు తినకూడదు. ధూమపానం కూడా చేయకూడదు. గ్లౌజులు తీసిన తరువాత సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి

రసాయన ద్రావణం ప్రమాదకరం - డాక్టర్ శ్రీకాంత్




పంటపొలాలకు వినియోగించే కలుపు నివారణ, పురుగు నివారణ మందులు అత్యంత ప్రమాదకరమని జిల్లా ప్రభుత్వవైద్యశాల ఎండీ డాక్టర్ శ్రీకాంత్ చెబుతున్నారు. పంటపొలాల్లో పిచికారి చేసే క్రమంలో తగిన జాగ్రత్తలు పాటించకుండా నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణాల మీదకు వస్తుందని చెబుతున్నారు. తక్కువ మోతాదులో పీల్చుకునే మందు వల్ల కాలక్రమేణా అనారోగ్య సమస్యలు తలెత్తుతూ క్యాన్సర్, ఇతర అవయవాలపై ప్రభావం చూపుతున్నాయన్నారు. మందును బట్టి కేవలం 100 - 200 ఎంఎల్ అతి తక్కువ మోతాదులోనే ఒంట్లోకి ప్రవేశిస్తే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంటుందన్నారు.

పిచికారి చేసే సమయంలో..

పురుగు, గడ్డి మందుల రసాయన ద్రావణాన్ని పిచికారి చేసే క్రమంలో తలకు టోపి, ముక్కుకు, నోటికి మాస్కు, కళ్లజోడు ధరించాలి. శరీరం మొత్తం కప్పి ఉంచేలా దుస్తులు కానీ, సేఫ్టీ కిట్లు వినియోగించడం అత్యుత్తమం.

సంతానోత్పత్తి కేంద్రాలను.. తనిఖీ చేయండి

● లోపాలుంటే సమగ్ర నివేదిక అందజేయండి
● వైద్య ఆరోగ్య శాఖకు ప్రభుత్వ ఆదేశాలు



గుంటూరు మెడికల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో సంతానోత్పత్తి కేంద్రాలను తనిఖీ చేసి వాటిలో లోపాలు ఉంటే వెంటనే సమగ్ర నివేదిక అందజేయాలని సోమవారం ప్రభుత్వం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించింది. ఇటీవల విజయవాడ, హైదరాబాద్ కేంద్రాలుగా సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ సరోగసీ పేరిట అక్రమాలకు పాల్పడినట్లు తేలిన నేపథ్యంలో ప్రభుత్వం సోమవారం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో సంతానోత్పత్తి సెంటర్లను తనిఖీ చేసి సమగ్ర నివేదికను అందజేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. సంతానోత్పత్తి సేవలందిస్తున్న ఫెర్టిలిటీ సెంటర్ల నిర్వహణకు జిల్లా స్థాయిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అనుమతులు మంజూరు చేస్తారు. అనంతరం నిర్వహణ నియమాల మేరకు పనిచేసే విషయాన్ని కూడా డీఎమ్‌హెచ్‌ఓలు పర్యవేక్షించాల్సి ఉంటుంది. నియమాలను ఉల్లంఘించే ఆసుపత్రులపై తగిన చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. అధికారిక సమాచారం మేరకు రాష్ట్రంలో పనిచేస్తున్న సంతానోత్పత్తి కేంద్రాల సంఖ్య, గూగుల్ ద్వారా వెదికినపుడు వచ్చిన ఫెర్టిలిటీ సెంటర్లకు సంఖ్యలో చాలా వ్యత్యాసమున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో... రాష్ట్రంలో డీఎంహెచ్‌ఓ కార్యాలయం జిల్లాలో మొత్తం ఎన్ని ఐవీఎఫ్/సరోగసీ కేంద్రాలకు అనుమతులిచ్చారు? అనుమతులు లేకుండా ఎన్ని పనిచేస్తున్నాయి? 2024-25 సంవత్సరంలో జిల్లాలో ఎన్ని కేంద్రాలను పరిశీలించారు? లైసెన్స్ లేకుండా పని చేస్తున్న కేంద్రాలు ఎన్ని తేలాయి? ఆయా ఫెర్టిలిటీ సెంటర్ల పనితీరుపై ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? వాటిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు? ఎన్ని కేంద్రాలకు అనుమతులు నిరాకరించారు? నియమాలమేరకు ఈ ఫెర్టిలిటీ సెంటర్లు పని చేసేలా చూడటానికి ఎటువంటి చర్యలు చేపట్టారు? అనే అంశంపై సమగ్ర నివేదికను అందించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు

గతంలో గుంటూరులోనూ అవకతవకలు...

సరోగసీ పేరిట దంపతులను మోసం చేసి ప్రస్తుతం జైలు ఊచలు లెక్కబెడుతున్న గైనకాలజిస్ట్ డాక్టర్ నమ్రత, గతంలో గుంటూరులోని కొత్తపేటలో సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ నిర్వహించి మోసాలకు పాల్పడ్డారు. అప్పట్లో సంతానం కోసం వచ్చిన దంపతులకు మగ పిల్లాడిని మాత్రమే పుట్టించే అమెరికన్ టెక్నిక్ తమ దగ్గర ఉందని డాక్టర్ నమ్రత నమ్మబలికించి వారి నుంచి రూ.లక్షలు కాజేశారు. అయితే ఐవీఎఫ్ చికిత్సల్లో రెండు సార్లు ఆ దంపతులకు ఆడ బిడ్డ జన్మించడంతో దంపతులు, అప్పటి డీఎంహెచ్‌వో డాక్టర్ గోపీనాయక్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు జరిపిన విచారణలో డాక్టర్ నమ్రత వారిని మోసం చేసినట్లు తేలడంతో డీఎంహెచ్‌వో గోపీనాయక్, సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌ను సీజ్ చేశారు. ఆమె తప్పించుకొని విజయవాడ వెళ్లిపోయారు. అప్పటి నుంచి సదరు డాక్టర్ తన పద్ధతి మార్చుకోలేదని తాజా సంఘటన చెబుతోంది.

విజయవాడలో మరో సెంటర్ ఆమెదే!

ఇది ఇలా ఉంటే సోమవారం ఎన్‌టీఆర్ జిల్లా డీఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ సుహాసిని, విజయవాడలో పనిచేస్తున్న యూనివర్సల్ హెల్త్ కేర్ సెంటర్ పై తమ బృందంతో కలసి తనిఖీకి వెళ్లగా ఆ కేంద్రం మూసి ఉన్నట్లు ఆమె మంత్రి కార్యాలయానికి తెలిపారు. అక్రమాల ఆరోపణలతో అరెస్ట్ అయిన డాక్టర్ నమ్రత పేరిటనే యూనివర్సల్ ఫెర్టిలిటి సెంటర్ మంజూరు అయిందని ఆమె వెల్లడించారు. తనిఖీ సమయానికి ఈ సెంటర్ సిబ్బంది ఎవరు లేకుండా మూసి ఉండటం అనుమానాలకు దారి తీస్తోందని, ఈ అంశాన్ని సమగ్రంగా పరిశీలించి తగు చర్యలు చేపడతామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని తెలిపారు.



ఉచిత ప్రయాణంపై కసరత్తు

● ప్రణాళికలు సిద్ధం చేస్తోన్న ఆర్టీసీ యంత్రాంగం
● రేపు గుంటూరులో ఆర్టీసీ ఎండీ తిరుమలరావు సమావేశం
● మహిళలకు ఉచిత ప్రయాణంపై దిశా నిర్దేశం

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై ఆర్టీసీ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సర్వీసులు, మహిళా ప్రయాణీకుల వివరాలు వంటి వివిధ అంశాలపై ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా అధికారులకు దిశానిర్దేశం చేసేందుకు ఆర్టీసీ మేనేజింగ్ డైరక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఈనెల 30న గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్ పర్యటనకు వస్తున్నారు. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ పర్యటన షెడ్యూల్‌ను జిల్లా అధికారులకు తెలియజేశారు. ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ఉమ్మడి జిల్లా పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇటీవల గుంటూరు జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీవో)గా బాధ్యతలు చేపట్టిన సీహెచ్ విమల ఇటీవల విదేశీ పర్యటనకు వెళ్ళటంతో ఆమె స్థానంలో గుంటూరు ఇన్‌ఛార్జ్ డీపీటీవోగా బాపట్ల డీపీటీవో సామ్రాజ్యం ఇప్పటికే బాధ్యతలు స్వీకరించారు. కాగా నెల్లూరు జోన్ ఈడీ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పల్నాడు డీపీటీవో అజితకుమారితో పాటు డిపోల మేనేజర్లతో ఎండీ తిరుమలరావు సమీక్ష నిర్వహించనున్నారు. ప్రధానంగా ప్రభుత్వం ఆగస్టు 15నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించాలన్న పథకాన్ని అమలు చేసేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. దాంతో ముందుగా సన్నాహాలు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ముఖ్యంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎన్ని సర్వీసులు ఉన్నాయి. రోజువారీ ప్రయాణీకుల సంఖ్య ఎంత, ఇందులో మహిళా ప్రయాణీకుల సంఖ్య ఎంత శాతం ఉంది, ఎన్ని కిలోమీటర్లు బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయనే అంశాలపై అధికారులు గణాంకాలు తీస్తున్నారు. మరోవైపు ఉచిత ప్రయాణం అమలుచేస్తే మహిళా ప్రయాణీకుల సంఖ్య 20నుంచి 30శాతం వరకైనా పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆయా గణాంకాలతో అధికారులు సమీక్షకి రావాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

ఉచిత ప్రయాణంపై అధికారుల్లో ఆందోళన....

మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలుపై అధికారుల్లో కొంత ఆందోళన వ్యక్తమవుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు వెయ్యి వరకు సర్వీసులు ఉన్నాయని, అందులో అత్యధికశాతం డొక్కు బస్సులు ఉన్నాయని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఈ ఏడాదిలో పది శాతం వరకు డొక్కు బస్సులను తొలగించారని, మిగిలిన బస్సులతో నెట్టుకొస్తున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణంపై ఏ విధంగా అమలు చేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నారు. మరో వైపు ఉచిత ప్రయాణంపై ఇప్పటికే ఐదు కేటగిరీల బస్సులకు అందజేయనున్నట్లు ప్రభుత్వ పెద్దల నుంచి ప్రకటనలు వినిపిస్తున్నాయి. అయితే ఆయా కేటగిరీలపై స్పష్టత రావాల్సి ఉందని చెబుతున్నారు. ప్రస్తుతమున్న సర్వీసులకు అదనపు సర్వీసులు అవసరం తప్పదని, అందుకు అనుగుణంగా సిబ్బంది కూడా కావాల్సి ఉందని ఉద్యోగ సంఘాల నుంచి ఇప్పటికే పలు విజ్ఞాపనలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణంపై ఎండీ అధికారులకు దిశా నిర్దేశం చేయనున్నారు.



దుగ్గిరాల స్టేషన్ ఆవరణలో నిర్మించిన ప్రయాణికుల బ్రిడ్జి

దుగ్గిరాల రైల్వే స్టేషన్‌కు నూతన హంగులు



సర్వాంగ సుందరంగా ముస్తాబైన దుగ్గిరాల రైల్వేస్టేషన్

● నేటి నుంచి కొత్త భవనంలో టిక్కెట్ బుకింగ్
● నూతన ఫుట్ ఓవర్ బ్రిడ్జి, సిగ్నలింగ్ వ్యవస్థ



దుగ్గిరాల స్టేషన్ సూపరింటెండెంట్ ఆధీనంలో ఉండే అత్యాధునిక సిగ్నల్ వ్యవస్థ



దుగ్గిరాల రైల్వేస్టేషన్ బుకింగ్ కౌంటర్

దుగ్గిరాల, జూలై 28(ఆంధ్రజ్యోతి): పసుపునకు ప్రఖ్యాతిగాంచిన దుగ్గిరాలలోని రైల్వేస్టేషన్ ఆధునీకీకరణతో సర్వాంగ సుందరంగా మారింది. మంగళవారం నుంచి నూతనంగా నిర్మించిన బుకింగ్ కేంద్రం ద్వారానే ప్రయాణికులకు టిక్కెట్లు ఇవ్వనున్నట్లు రైల్వేస్టేషన్ అధికారులు చెబుతున్నారు. 322 కిలోమీటర్లమేర నిర్మాణం పూర్తిచేసుకున్న మూడవ లైన్ నిర్మాణ అనంతరం.. 137 ఏళ్ల క్రితం 1888లో నిర్మించిన దుగ్గిరాల రైల్వేస్టేషన్ పాతభవనం తొలగించాల్సివచ్చింది. ఇప్పటికే మూడోలైన్‌పై పలుమార్లు ట్రైల్‌రన్ నిర్వహించారు. సిగ్నల్ వ్యవస్థ, క్యాబిన్ నిర్మాణంతోపాటు కొత్తగా ఇతర ప్లాట్ ఫాంలకు వెళ్లేందుకు అదనపు బ్రిడ్జి కూడా నిర్మించారు. తెనాలివైపు మూడోలైన్ కోసం రైల్వేబ్రిడ్జి నిర్మాణం కూడా చేపట్టారు. దుగ్గిరాల రైల్వేస్టేషన్ మీదుగా నిత్యం వందల రైళ్లు వెళ్తుంటాయి. గతంలో మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌కు పసుపు పంట తరలించేందుకు దుగ్గిరాల వాణిజ్య కేంద్రంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రత్యేక లూప్‌లైన్ గూడ్స్‌షెడ్ కూడా ఉండేది. కాలక్రమేణా ఎగుమతులు తగ్గుముఖం పట్టడం, లారీల ద్వారా రవాణా చేయడం ప్రారంభించారు. గతంలో తిరుమల, హౌరా ఎక్స్‌ప్రెస్ రైళ్లు దుగ్గిరాల స్టేషన్‌లో ఆగేవి. ప్రస్తుతం ప్యాసింజరు రైళ్లు, ఒక్క కృష్ణాఎక్స్‌ప్రెస్‌కు మాత్రమే ఇక్కడ హాల్టింగ్ ఉంది. భవిష్యత్తులోనైనా.. ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపే అవకాశం ఉంటుందేమోనని పరిసర గ్రామాల ప్రయాణికులు ఎదురు చూస్తున్నారు. రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు భారీ గుంతలతో అధ్వానంగా మారింది. రోడ్డు నిర్మాణం కూడా చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అప్పుడు నిషేధం.. ఇప్పుడు నివాసం

● రాళ్లగుట్టలు బ్రిటీష్ జమానాలో 22ఏలో చేరిక
● దాచేపల్లిలో ఇప్పుడు అవే నివాస ప్రాంతాలు
● హక్కులు పొందలేకపోతున్న గృహ యజమానులు
● రూ.లక్షల పన్ను ఆదాయం కోల్పోతున్న నగర పంచాయతీ

దాచేపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష కాలం నాటి చట్టాలు నేటికి అమలు కావడం ప్రజలను ఇబ్బంది పెడుతోంది. భూమి నైతిక స్వరూపం, రాళ్ల గుట్ట, పోరంబోకు, వాగు, వంక, డొంక, అటవీ భూమి ఇవన్నీ కూడా 1920లో ఆర్ఎస్ఆర్(రీసర్వే రిజిస్టర్)లో ఏ విధంగా నిర్ణయించారో అదే పరిస్థితి నేటికి కూడా అమలువుతోంది. ఒకప్పుడు రాళ్ల గుట్టగా ఉన్న స్థలాలు నేడు నగర పంచాయతీలో అత్యంత విలువైన, ప్రధానమైన ప్రాంతంగా మారింది. ఉదాహరణ నగర పంచాయతీలోని 62/2ఏ, 66/2ఏ/5, 66/2బీ, 158/13, 14, 15, 16, 17, 18, 19, 20, 995/19, 20, 21డీ ఈ సర్వే నంబర్ల భూములు 22ఏ లిస్టులో ఉన్నాయి. ఇవన్నీ కూడా ఎంతో అభివృద్ధి చెంది ఉద్యోగులు, వ్యాపారులు, వ్యవసాయ కూలీలు అధికంగా నివాసం ఉంటున్న ప్రాంతాలు. వందేళ్ల క్రితం తయారు చేసిన రికార్డులు ఏం చెబుతున్నాయో.. ఇప్పటికీ కూడా అవే చట్టాలు అమలు కావడంతో ప్రజలు పడుతున్న పాట్లు అన్నీ, ఇన్నీ కావు. దాచేపల్లి.. గ్రామ స్థాయి నుంచి నగర పంచాయతీగా అభివృద్ధి చెందింది. తెలంగాణ రాష్ట్రానికి సరిహద్దు మండలంగా ఉండటంతో ఆంధ్రాకు ముఖద్వారంగా మారింది. సున్నపు రాయి గనులు విస్తారంగా ఉండటంతో చిప్స్ అండ్ పల్వరైజింగ్, కెమికల్ ఫ్యాక్టరీలు, సిమెంట్ పరిశ్రమలు విస్తారంగా ఉన్నాయి. దీంతో కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడ్డాయి. ఆస్పత్రులు ప్రభుత్వ కళాశాలలు దాచేపల్లిలో ఏర్పాటయ్యాయి. విద్యా, వైద్య, రవాణా పరంగా దాచేపల్లి గణనీయంగా ముందుకు రావడంతో ఈ ప్రాంతమంతా ఉద్యోగులు, వ్యాపారులు అధిక సంఖ్యలో స్థిర పడ్డారు.

వేరే సర్వే నంబరుతో రిజిస్ట్రేషన్..

విద్యా వైద్య పరంగా దాచేపల్లి.. అభివృద్ధి చెందిందే కాని దాచేపల్లి నగర పంచాయతీలో ఆర్‌అండ్‌బీ బంగ్లా సెంటర్ వెనుక భాగం, అంజనాపురం, నారాయణపురం 14, 15, దుర్గా భవానీ కాలనీలో భూములన్నీ కూడా రాళ్లగుట్ట పోరంబోకుగా ప్రభుత్వ భూముల రికార్డుల్లో నమోదయ్యాయి. ఆర్‌అండ్‌బీ బంగ్లా సెంటర్ దాచేపల్లికి ప్రధాన ప్రాంతం. ఇక్కడ వ్యాపారులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో నివశిస్తుంటారు. దుర్గాభవానీ కాలనీలో వ్యవసాయ కూలీలు, ముగ్గు మిల్లు కార్మికులు నివాసం ఉంటారు. అటు పేదలు కావచ్చు. ఇటు ధనవంతులు కావచ్చు ..అందరికీ కూడా 22ఏ రాళ్లగుట్టగా నమోదైన స్థలాల్లో నివాసం ఉంటున్నారు. వీరు రాళ్లగుట్ట నంబరు కాకుండా.. మరొక సర్వే నంబరు వేసి రిజిస్ట్రేషన్ చేసుకొని అమ్మకాలు, కొనుగోళ్లు సాగిస్తుంటారు.

ఉభయ నష్టదాయకం..

శాటిలైట్ సర్వేలో నివాస ప్రాంతాలు 22ఏగా స్థలాలుగా చూపించడంతో.. ఇళ్ల కొనుగోళ్లు చేసిన లబ్ధిదారులు నగర పంచాయతీలో ఇంటిపన్ను కట్టించుకోవడానికి మునిసిపల్ అధికారులు ముందుకు రావడం లేదు. దీంతో.. ఏటా లక్షల రూపాయలు ఇంటి పన్ను ఆదాయాన్ని నగర పంచాయతీ కోల్పోతుండగా.. స్థానికులకు ప్రభుత్వ పరంగా ఇచ్చే బ్యాంక్ రుణాలు, ఆస్తి హక్కును కోల్పోతున్నారు. ఈ నిబంధన తొలగించాలని స్థానికులు ఎంతో కాలం నుంచి పోరాటం చేస్తున్నప్పటికీ దానిని పట్టించుకున్న వారే లేరు. ఇప్పుడు నగర పంచాయతీలోని నారాయణపురంలో స్థలాల ధరలు గణనీయంగా పెరిగాయి. స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్ల రిజిస్ట్రేషన్‌లు జరిగినప్పుడు నగర పంచాయతీ ఆదాయం వస్తుంది. ఈ విధంగా కూడా నష్టపోయే పరిస్థితులు ఉన్నాయి. ప్రజలకు ఉపయోగ పడక, ప్రభుత్వానికి ఆదాయం రాక ఉన్న ఈ చట్టాలను మార్చాలని ప్రజలు కోరుతున్నారు. బ్రిటీషు కాలం నాటి చట్టాలే ఇప్పటికీ కొనసాగడం స్థానికులకు ఇబ్బందికరంగా ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, 22ఏను తొలగించాలని కోరుతున్నారు.



దాచేపల్లి నగర పంచాయతీ



ఏపీఎస్ ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ నరసరావుపేట డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ బీ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవర్‌గా పనిచేసేందుకు ఎనిమిదో తరగతి విద్యార్హత కలిగి ఉండాలన్నారు. హెవీ వెహికల్ లైసెన్స్ వచ్చి ఒక టిన్నర సంవత్సరం అయి ఉండాలన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ నిబంధనల ప్రకారం డ్రైవింగ్ చేసే వారికి ప్రతి దినం రూ.800లు జీతం ఇస్తారన్నారు. అర్హులైన వారు అదనపు సమాచారం కోసం 9959225428 నంబరును సంప్రదించాలని కోరారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి: 99854 11226, 99854 11220
99852 07026

పాత శివాలయంలో జీవీ దంపతుల ప్రత్యేక పూజలు

వినుకొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్‌లోని పాత శివాలయంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుతో పాటు ఆయన సతీమణి శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆలయ అర్చకులు జీవీ దంపతులను పూర్ణాహుతితో స్వాగతం పలికి పూజల అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.

డాక్టర్ అంజిరెడ్డి వైద్యశాలలో 450 మందికి వైద్య పరీక్షలు

నరసరావుపేట లీగల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ అంజిరెడ్డి వైద్యశాలలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 450 రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు తెలిపారు. శిబిరం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు కొనసాగిందన్నారు. శిబిరంలో గుండె, కిడ్నీ, లివర్, జీర్ణకోశ, చెవి ముక్కు గొంతు సమస్యలు, ఎముకలు కీళ్ల సమస్యలు, విష జ్వరాలు, బీపీ, షుగర్, అన్ని రకాల లాప్రోస్కోపిక్ సర్జరీలు, ఇతర అనారోగ్య సమస్యలకు పూర్తిగా ఉచితంగా చికిత్స అందించారు. అవసరమైన పేషెంట్లకు ఎన్టీఆర్ వైద్య సేవ, ప్రైవేట్ ఇన్సూరెన్స్ ద్వారా ఉచితంగా వైద్యం అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

చిలకలూరిపేట ఎంఈవోగా సత్యనారాయణ సింగ్ బాధ్యతల స్వీకారం

చిలకలూరిపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండల విద్యాశాఖ అధికారిగా బి.సత్యనారాయణ సింగ్ నియమితులయ్యారు. సోమవారం ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. నరసరావుపేటలోని శ్రీరామకృష్ణ ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తున్న ఆయన ఎంఈవోగా పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం బొప్పూడిలోని ఎంపీపీఎస్ అజాద్ ప్రాథమిక పాఠశాలను, అదే ప్రాంగణంలోని ఉర్దూ పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల మరుగుదొడ్లనును కూడా పరిశీలించారు.

పీజీఆర్ఎస్‌లో ఒక ఫిర్యాదు

రొంపిచర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఒక ఫిర్యాదు అందినట్టు తహసీల్దార్ బండి నిర్మల తెలిపారు. సంతగుడిపాడు నుంచి సర్వే కోసం దరఖాస్తు వచ్చినట్టు పేర్కొన్నారు.

రొంపిచర్లలో సెక్టార్ సమావేశం

రొంపిచర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్లలో రొంపిచర్ల సెక్టార్ సమావేశం సోమవారం జరిగింది. సూపర్ వైజర్ మరియకుమారి ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను నిర్దేశించిన సమయంలో తెరచి ఉంచేలా చూడాలన్నారు. చిన్నారులు, గర్భిణులు, తల్లులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలపై ఫిర్యాదులు రాకుండా సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనం పంపిణీ

నరసరావుపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతు సేవా కేంద్రాల ద్వారా రాయితీపై వరి విత్తనం పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ జేడీ ఎం జగ్గారావు సోమవారం తెలిపారు. 3,755 క్వింటాళ్ల బీపీటీ 5204, కేఎస్ఎం 1638, ఎన్ఎల్ఆర్ 34449 రకం వరివిత్తనాలు కిలోకు రూ.5 రాయితీపై పంపిణీ చేస్తున్నామన్నారు.

ట్రైనీ ఎస్ఐగా నరేష్ కుమార్

నూజెండ్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు పోలీసు స్టేషన్‌లో ట్రైనీ ఎస్ఐగా పీ నరేష్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఐనవోలు ఎస్ఐ బీవీ కృష్ణారావు ట్రైనీ ఎస్ఐకు చేపట్టాల్సిన బాధ్యతలు, కోర్టు విషయాలు తదితర అంశాలపై వివరించారు.

కవి కమలారామ్‌కు కళాంజలి అవార్డు

వినుకొండ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన జనవిజ్ఞాన అధ్యక్షుడు, జాషువా సమాఖ్య గౌరవాధ్యక్షుడు, కవి కమలారామ్‌కు కళాంజలి అవార్డు అందజేసినట్లు సకల కళాకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చరణ్ ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరులోని శ్రీకృష్ణ కల్యాణ మండపంలో స్టేజీ ఫిలిం నటులకు, గాయలకు, చిత్రకళాకారులు, కవుల అవార్డుల ప్రదాన కార్యక్రమంలో కమలారామ్ ఈ అవార్డు అందుకున్నారు.

రైతులు పంటల బీమా చెల్లించాలి: ఏవో

వినుకొండ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రైతులు సాగు చేస్తున్న కంది, మిరప, పత్తి వంటి పంటలకు బీమా చెల్లించాలని మండల వ్యవసాయాధికారి వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. బీమా చెల్లించేందుకు రైతు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్ఎస్‌లో) పట్టాదారు పాస్ బుక్, ఆధార్‌కార్డు, క్రాప్ సర్టిఫికెట్‌తో ప్రీమియం చెల్లించవచ్చన్నారు.

శిథిలావస్థలో విద్యుత్ కార్యాలయం

చిలకలూరిపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డైక్‌మన్ నగర్‌లో ఉన్న విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం ఏ క్షణంలోనైనా కుప్పకూలే స్థితిలో ప్రమాదకరంగా ఉంది. ఈ భవనంలో విద్యుత్ ఏడీఈ, టౌన్1, టౌన్2, రూరల్ ఏఈ కార్యాలయాలు ఉన్నాయి. 2007 ప్రధాన భవనం నిర్మించారు. 2012లో పైఅంతస్తు నిర్మించారు. 18 ఏళ్లకే భవనం శిథిలావస్థకు చేరింది. వేరే భవనాన్ని లీజుకు తీసుకుని కార్యాలయాలను అక్కడనుంచి తక్షణం మార్చడానికి అనుమతి కోసం స్థానిక అధికారులు ఉన్నతాధికారులకు విన్నవించారు.



పెచ్చులూడి ఊచలు బయటపడి అధ్వాన స్థితిలో ఉన్న చిలకలూరిపేట విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, ఇతర అధికారులు

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం

● కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) వేదికలో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల వేదిక ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి అర్జీలను జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి మురళి, ఇతర అధికారులు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌లో 148 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణ్‌బాబు మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా అర్జీల పరిష్కారతీరు ఉండాలని స్పష్టం చేశారు. అర్జీలు రీ-ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు పరిష్కారం కోసం పంపాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

యడ్లపాడు, జూలై 28(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయకత్వంలో పార్టీల కతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండవీడు, కొత్తపాలెం, మైదవోలు గ్రామాలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఇంటింటికి వెళ్ళి ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకుని ఆన్‌లైన్‌లో అప్పటికప్పుడు నమోదు చేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో వైసీపీ కార్యకర్తలకు సైతం మేలు జరుగుతుందన్నారు. పరిశ్రమలు రావడం వలన భూముల ధరలు పెరిగి అందరికీ ఆదాయం వస్తుందన్నారు. వైసీపీని నమ్మి ప్రజలు ఎంతగా నష్టపోయారో తెలుసుకోవాలన్నారు. పంతాలు పట్టింపులు వదలి అభివృద్ధి కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆధిపత్య ధోరణి ఎవరికీ మేలుచేయదని హెచ్చరించారు.

కొండవీడుకోట అభివృద్ధికి కృషి

కూటమి ప్రభుత్వం కొండవీడుకోటకు పూర్వ వైభవం తీసుకురావాలన్న కృతనిశ్చయంతో ఉందని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. కొండవీడును ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది ఉత్సవాలను రాష్ట్రస్థాయిలో ఘనంగా నిర్వహిస్తామన్నారు.

ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మైదవోలు, కొండవీడు, కొత్తపాలెం గ్రామాలలో పర్యటించిన ప్రత్తిపాటి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మైదవోలు, కొండవీడులో రూ.24లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించిన ఆయన కొత్తపాలెంలో ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కొత్తపాలెంలో ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

అట్టహాసంగా సొసైటీ పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేయిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, వేదికపై చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి, మక్కెన

శావల్యాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా నియమించిన శావల్యాపురం సొసైటీ పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవాన్ని సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు పాల్గొన్నారు. ప్రమాణస్వీకారానికి నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి సొసైటీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ కూడలిలోని ఎన్టీఆర్, పరిటాల విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ర్యాలీ సొసైటీ కార్యాలయం వద్దకు చేరుకోగానే కార్యకర్తలు గజమాలతో నాయకులను ఘనంగా సత్కరించారు. సొసైటీ కార్యాలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన జన ఔషధి కేంద్రాన్ని మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి ప్రారంభించారు. సొసైటీ కార్యాలయం ముందు నూతనంగా నిర్మించిన ఇంకుడుగుంతను ప్రారంభించారు. అనంతరం సొసైటీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సభావేదికపై కొత్తగా నియమమించిన సొసైటీ చైర్మన్ గడిపూడి విశ్వనాథం, డైరెక్టర్లు గోనుగుంట్ల నాగరాజు, బండారి వీరాంజనేయులుతో జిల్లా టీడీపీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ గడిపూడి విశ్వనాథం మాట్లాడుతూ రైతులకు న్యాయం చేయటం కోసం చైర్‌పర్సన్ అయ్యానన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి రైతుకు న్యాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పారా హైమావతి, టీడీపీ మండలాధ్యక్షులు గుంటూరు సాంబశివరావు, కౌన్సిలర్ షకీల, డీసీ చైర్మన్ మందలపు వెంకటనారాయణ, జనసేన నేతలు కొణిజేటి నాగశ్రీను రాయల్, నిశ్శంకర శ్రీను, బీజేపీ నేతలు నలబోలు విష్ణు, గోరింట్ల సత్యనారాయణ, టీడీపీనాయకులు యరమాసు కోటేశ్వరరావు, గోరింట్ల హనుమంతరావు, గద్దె వీరమస్తాన్‌రావు, బొల్లా పేరయ్య, సాదినేని కృష్ణ, ఒత్తుల వెంకటేశ్వర్లు, రాపర్ల జగ్గారావు, పెమ్మసాని నాగేశ్వరరావు, పీవీ సురేష్, వంకాయలపాటి పేరయ్య, సొసైటీ సీఈవోలు జాలాది నాగప్రసాద్, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

20 ఏళ్ల తర్వాత మాచర్లలో టీడీపీ జెండా ఎగిరింది: మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచక పాలనపై విసుగుచెందిన ప్రజలు కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని, 20ఏళ్ళ సుదీర్ఘకాలం తర్వాత మాచర్లలో టీడీపీ జండా ఎగిరిందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. శావల్యాపురం సొసైటీ కార్యాలయంలో త్రిసభ్యకమిటీసభ్యుల ప్రమాణస్వీకారం మహోత్సవానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మళ్ళీమళ్ళీ అధికారంలోకి రావాలని, అప్పుడే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు ఏర్పడుతుందన్నారు.

కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు: కొమ్మాలపాటి

పార్టీకోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు రానున్న రోజుల్లో తప్పకుండా గుర్తింపునివ్వడం జరుగుతుందని జిల్లా టీడీపీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ప్రమాణస్వీకార మహోత్సవంలో ఆయన మాట్లాడుతూ కార్యకర్తలెవ్వరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు.



ప్రమాణ స్వీకారోత్సవానికి తరలివస్తున్న నాయకులకు గజమాలతో స్వాగతం

సీజనల్ వ్యాధులకు మందుల పంపిణీ

వినుకొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 15వ వార్డులో గజవల్లి నాగపవన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సీహెచ్. ప్రసాద్, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, నాగరాజు, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు, మందు బిళ్లలను పంపిణీ చేస్తున్న గజవల్లి నాగపవన్

ఏఎంరెడ్డి కళాశాలలో ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం

నరసరావుపేట టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో సోమవారం ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పీ భార్గవ భూషణ్‌రావు మాట్లాడుతూ హెపటైటిస్ వ్యాధి నివారణకు అనుసరించాల్సిన జాగ్రత్తలపై ప్రసంగించారు. విద్యార్థులు హెల్త్ క్యాంప్, పోస్టర్ ప్రదర్శనలు, చిన్న నాటకాల ద్వారా సందేశాలను ఇచ్చారు.

చారు మజుందార్‌కు ఘన నివాళి

వినుకొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కార్యాలయంలో చారు మజుందార్ 54వ వర్ధంతి కార్యక్రమం ఫిరోజ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పల్నాడు జిల్లా కార్యదర్శి తోట ఆంజనేయులు పాల్గొని చారుమజుందార్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల కోసం, భూమి కోసం భుక్తి కోసం అనేక రాష్ట్రాల్లో భూ పోరాటాలు విజయవంతంగా నడిపిన నాయకుడు నక్సల్ బరి ప్రాంతం నుంచి ప్రారంభమైన ఉద్యమం దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో పోరాటాలుచేసిన నాయకుడు చారు మజుందార్ అని కొనియాడారు. కార్యక్రమంలో గోపాల్ నాని, భాస్కర్, నాగేశ్వరరావు, ప్రసాద్, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, హరికృష్ణ హనుమంతరావు, లింగాచారి, కోటయ్య, యలమంద తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో మెప్మా రిసోర్స్ పర్సన్‌లకు ట్యాబ్‌లు పంపిణీ

నరసరావుపేట టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 33వ వార్డులో సోమవారం మెప్మా రిసోర్స్‌పర్సన్‌లకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ కొల్లిపాక చంద్రశేఖర్, పల్నాడు సమైఖ్య అధ్యక్షురాలు షేక్ అఖిల, టూ టౌన్ టీఎల్ఎఫ్ సెక్రటరీ మల్లేశ్వరిలు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో, మెప్మా ఆన్‌లైన్ సేవలను సులభతరం చేయడానికి, బ్యాంక్ లావాదేవీలు అప్‌లోడ్ చేసేందుకు ట్యాబ్‌లు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ముప్పాళ్ళ నరసింహారావు, మోదుగుల సుబ్బారావు, ఆర్పీలు నాగవేణి, వేములమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ఆర్పీలకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్, సమైక్య అధ్యక్షురాలు షేక్ అఖిల తదితరులు

పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించండి

● సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి ఊట్ల రామారావు

ఈపూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జీతాలు చెల్లించాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు. పదినెలలుగా జీతాలు చెల్లించకపోతే జీవనం ఎలా గడుస్తుందని సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి ఊట్ల రామారావు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం చెబుతున్నట్లు క్షేత్రస్థాయిలో చేయడం లేదన్నారు. జీతాలు చెల్లించాలని ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలోపిన్నబోయిన వెంకటేశ్వర్లు, పారిశుధ్య కార్మికులు ఉన్నారు.



ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు, సీపీఐ నాయకులు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

నరసరావుపేట టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు లబ్ధిదారులకు సోమవారం పంపిణీచేశారు. 23 మంది లబ్ధిదారులకు రూ.17లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారంతో నరసరావుపేట నియోజకవర్గంలో ఏడాది కాలంలో సుమారు రూ.10 కోట్లు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశామన్నారు. గతంలో టీడీపీ కార్యకర్త మదార్‌పై వైసీపీ గుండాలు దాడిచేసి అతని రెండుకాళ్ళు విరగ్గొట్టారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన సీఎం చంద్రబాబు నాయుడు మదార్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించడంతో పాటు అతని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఐర్లాండ్‌లో చదువుతూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రొంపిచర్లకు చెందిన రమేష్ కుటుంబానికి పార్టీ నిధుల నుంచి రూ.5 లక్షలు చెక్కును అందజేశామన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

డీఆర్‌డీఏ కార్యాలయంలో ఎమ్మెల్యే అరవిందబాబు పరిశీలన

నరసరావుపేట రూరల్, జులై 28 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం కోటప్పకొండలోని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయ భవనం ఇటీవల మరమ్మతులు పూర్తిచేయడంతో, ఎమ్మెల్యే ఈ అభివృద్ధి పనులను పరిశీలించారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ నిర్వహిస్తున్న నేపథ్యంలో, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు డీఆర్‌డీఏ సిబ్బందితో సమావేశమై, కార్యాలయ నిర్వహణ, అభివృద్ధి పనుల గురించి చర్చించారు.

రావిపాడు రోడ్డులో 33 కేవీ సబ్ స్టేషన్ కోసం స్థల పరిశీలన

రావిపాడు రోడ్డులో స్వర్గపురి సమీపంలో 33 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్థలపరిశీలన చేశారు. దీర్ఘకాలంగా లో వోల్టేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటు ద్వారా శాశ్వత పరిష్కారం చూపాలని విద్యుత్ శాఖ నిర్ణయించింది. స్థానిక ప్రజల నుంచి ఫిర్యాదులను పరిశీలించిన ఎమ్మెల్యే లో వోల్టేజీ సమస్య వల్ల గృహ, వాణిజ్య వినియోగదారులు ఎదుర్కొంటున్న సవాళ్ళను అధికారులతో చర్చించారు. సబ్ స్టేషన్ నిర్మాణం వేగవంతం కోసం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఇంజనీర్లు, స్థానిక నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో ఎస్పీకి 96 ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ కంచి శ్రీనివాసరావు పాల్గొని ప్రజల వద్ద నుంచి 96 ఫిర్యాదును స్వీకరించారు. నరసరావుపేట మండలం పమిడిపాడుకు చెందిన షేక్ ఆదం పమిడిపాడుకు చెందిన షేక్ దరియావలి వద్ద 2016వ సంవత్సరంలో రూ.4,20,000 సొలసకి చెందిన మరియదాసుకు ఇప్పించి అనంతరం పూర్తిగా నగదు చెల్లించినా దరియావలి వేధిస్తున్నట్లు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

అధ్వానంగా ఎస్సీ హాస్టళ్ల నిర్వహణ

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అధ్వానంగా ఎస్సీ హాస్టళ్ల నిర్వహణ ఉందని పల్నాడు జిల్లా వైసీపీ కార్య నిర్వాహక అధ్యక్షుడు, మాజీ మ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. వైసీపీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ హాస్టల్స్ తనిఖీచేసే కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట పట్టణంలో ఎస్ఎస్ఎన్ కాలేజీ వద్ద ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం రాత్రి తనిఖీచేశారు. ఈ సందర్భంగా నిర్వహణ లోపాలపై డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వ హయాంలో ఎస్సీ హాస్టళ్ల నిర్వహణ పనితీరు అధ్వానంగా తయారైందన్నారు. హాస్టల్‌లో సుమారు 150నుంచి 200మంది వరకు కళాశాల విద్యార్థులు ఉంటున్నారని, ఒక్కొక్క రూమ్‌లో 15మంది బాలురు ఉంటున్నారని, విద్యార్థులకు ఇక్కడ కనీస వసతులు కూడా లేవని, విద్యార్థులు నేలపైనే పడుకుంటున్నారని, ఏ ఒక్క రూమ్‌లో కూడా లైట్లు గాని ఫ్యాన్లు గాని సక్రమంగా లేవని, ఒక రూమ్‌లో అయితే 15 రోజుల నుంచి లైట్లు వెలగడం లేదని, ఈ రకంగా హాస్టల్స్ ఉంటే విద్యార్థులు ఏ విధంగా చదువుకుంటారని ప్రశ్నించారు. మరుగుదొడ్లు దుర్వాసనతో ఉన్నాయని, హాస్టళ్లు మొత్తం అపరిశుభ్రంగా ఉన్నాయని ఆరోపించారు. హాస్టళ్లలో లైట్లు, ఫ్యాన్లు వైసీపీ తరఫున ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎస్సీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కందుల ఎజ్రా, మాజీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ కె సుజాతపాల్, నరసరావుపేట వైసీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుక్కల పౌలు తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో ఎస్సీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నివేశన స్థలాల దరఖాస్తుకు అవకాశం కల్పించండి

● తహసీల్దార్‌కు యడ్లపాడు వాసుల వినతి

యడ్లపాడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నివేశన స్థలాలకోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని యడ్లపాడు గ్రామస్థులు తహసీల్దార్ విజయశ్రీని కోరారు. ఈ మేరకు సోమవారం కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో నివేశన స్థలాలకోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ తమకు ఎలాంటి స్థలాలు కేటాయించలేదన్నారు. అయితే తమకు నివేశన స్థలాలు ఇచ్చినట్లుగా ఆన్‌లైన్‌లో పేర్లు చూపిస్తున్నాయని, దీనితో రెవెన్యూ సిబ్బంది కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు రాగా తమ దరఖాస్తులను తిరస్కరించారన్నారు. ఆన్‌లైన్‌లో తమ పేర్లు కనిపించడంతో దరఖాస్తు చేసుకోలేకపోతున్నామని వాపోయారు. ఆన్‌లైన్‌లో తమ పేర్లను తొలగించి నివేశన స్థలాలకు దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బి.అంజలి, కె.మాధవి, ఎం.శిరీష, షేక్ కరీమూన్, ఎం.కొండమ్మ, ఐ.పేరులక్ష్మి, ఎల్.మేరికుమారి, జి.మేరీ, కె.పల్లవి, జి.శివ, ఎం.అర్ముగం, చిన్నస్వామి, కామినేని సుబ్బాయమ్మ, ఎస్.శివకుమారి, డి.ప్రసన్న, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.